ప్రజాశక్తి
ఆదివారం 27 నవంబర్ 2022 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

నిధుల గోల్‌మాల్ పై విచారణ చేస్తున్న డిఎల్‌పిఒ పద్మావతి

అమ్మనబ్రోలు పంచాయతీ

నిధులు గోల్‌మాల్

- సంబంధం లేని వ్యక్తి ఖాతాకు జమ
- తీర్మానాలు లేని వాటికీ నిధులు డ్రా

ప్రజాశక్తి-నాగులుప్పలపాడు

మండలంలోని అమ్మనబ్రోలు పంచాయతీలో భారీస్థాయిలో నిధులు గోల్‌మాల్ అయ్యాయి. గతంలో ప్రత్యేక అధికారుల పాలనలో ఎటువంటి తీర్మానాలు లేకుండా పనులు జరిగినట్లు చూపి.. నిధులు డ్రా చేశారు. గ్రీన్ అంబాసిడర్లు లేకుండా ఉన్నట్లు చూపి రూ.లక్షల్లో ఓ వ్యక్తి ఖాతాకు మళ్లించారు. గ్రామస్తులు సమాచార హక్కు చట్టం ద్వారా అడిగిన వివరాల మేరకు రూ.20 లక్షలు గోల్‌మాల్ జరిగినట్లు తేలింది. విచారణలో ఇంకా ఎంత తేలుతుందో చూడాల్సి ఉంది. పంచాయతీకి ఇన్‌ఛార్జి కార్యదర్శిగా (ఇఒ) ఉన్న మర్రి వెంకటేశ్వర్లు ఈ గోల్‌మాల్‌లో కీలకపాత్ర వహించినట్లు తెలుస్తోంది.

ఆ వ్యక్తి ఖాతాకే..

14వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి ఎటువంటి తీర్మానాలు లేకుండా రూ.2,65,190ను పంచాయతీకి ఎటువంటి సంబంధం లేని మర్రి పూర్ణప్రసాద్ అనే వ్యక్తి ఖాతాలో జమచేసినట్లు చూపారు. 15వ ఆర్థిక సంఘం నిధులకు సంబంధించి రూ.1,80,640ను, పంచాయతీలోని వివిధ పనులకు సంబంధించి ఎటువంటి తీర్మానాలు లేకుండా రూ.3,30,228ను పూర్ణప్రసాద్ ఖాతాకే వేశారు. ఫిబ్రవరి 2021 నుండి సెప్టెంబర్ 2021 వరకు పంచాయతీలో ఎటువంటి గ్రీన్ అంబాసిడర్లు పని చేయలేదు.. అయినప్పటికీ ఆ పేరుతో రూ.6,87,885 కూడా పూర్ణప్రసాద్ ఖాతాకు జమ చేశారు. పంచాయతీ కార్మికుల జీతాల పేరుతో రూ.1,65,520 కూడా పూర్ణప్రసాద్ ▶ 2లో

పర్చూరు నియోజకవర్గంపై

ఎందుకింత తర్జనభర్జన.!

- 'గడపగడపకూ..' తిరిగినా రామనాథంబాబుకు గ్యారంటీ లేని వైసిపి టిక్కెట్..
- నియోజకవర్గ టిక్కెట్ ఆమంచికి కేటాయించే యోచనలో అధిష్టానం

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అధికార వైసిపి, ప్రతిపక్ష తెలుగుదేశం పార్టీల అధినేతలు నియోజకవర్గాల్లో తమ పార్టీ అభ్యర్థులపై స్పష్టత ఇస్తున్నారు. వైసిపి ఇప్పటికే పలు పర్యాయాలు జరిపిన సర్వేల ఆధారంగా పార్టీ అధినేత జగన్ అభ్యర్థులను ఖరారు చేసే పనిలో ఉన్నారు. బాపట్ల జిల్లాలోని ఆరు నియోజకవర్గాల్లో వైసిపి, టిడిపి తరపున అభ్యర్థులు ఎవరు అనే విషయమై ఆయా పార్టీల అధినేతలకు స్పష్టత ఉన్నట్లు తెలుస్తోంది. జిల్లా మొత్తం మీద ఒక్క పర్చూరు విషయంలో మాత్రం అధికార వైసిపి తర్జనభర్జన పడుతున్నట్లు తెలుస్తోంది.

పర్చూరు నుంచి తెలుగుదేశం తరపున శాసనసభ్యులు ఏలూరి సాంబశివరావు మూడో పర్యాయం ఎన్నికల బరిలో నిలుస్తున్నారు. ఇక్కడ టిడిపి తరపున ఈయన పేరు తప్ప మరో పేరు వినపడటం లేదు. వైసిపిలో మాత్రం పరిస్థితి ఇందుకు పూర్తి విరుద్ధంగా ఉంది. పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి రామనాథంబాబు పార్టీ అధినేత చెప్పిన మేరకు గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో చురుగ్గా పాల్గొంటున్నారు. జిల్లాలో ఉన్న ఇతర వైసిపి ఇన్‌ఛార్జులు, ఎమ్మెల్యేల కంటే ఎక్కువ రోజులు నియోజకవర్గంలో పర్యటించారు. శనివారం నాటికి 161 రోజులు నియోజకవర్గంలో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ తిరిగారు. వైసిపి అధినేత జగన్ చెప్పిన ప్రకారం రానున్న ఎన్నికల్లో వైసిపి టిక్కెట్ దక్కాలంటే ఆయా నియోజకవర్గ ప్రస్తుత ఎమ్మెల్యేలు, ఇన్‌ఛార్జీలు ముందుగా గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమం అమలు పరీక్షలో ఉత్తీర్ణులవ్వాలి. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్దేశించిన రీతిలో సచివాలయాల వారీగా గృహాలు సందర్శించాలి. సంక్షేమ పథకాలు ప్రజలకు అందుతున్న తీరు గురించి తెలుసుకోవాలి. స్థానికంగా ఉన్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి కృషి చేయాలి. పార్టీ టిక్కెట్ పొందడానికి దీనినొక ప్రామాణికంగా పార్టీ అధినేత జగన్ చాలా స్పష్టంగా చెబుతూ వచ్చారు. తాను నిర్దేశించిన పద్ధతిలో గడపగడపకూ తిరగకపోతే పార్టీ టిక్కెట్ ఇచ్చే ప్రసక్తే లేదన్నారు. ఈ ఏడాది మే 11న గడపగడపకూ.. కార్యక్రమం ▶ 2లో

'గడపగడపకూ..' లో ప్రజలతో మాట్లాడుతున్న రామనాథంబాబు (ఫైల్)

అధికారుల సాక్షిగా

అడ్డగోలు మోసం.!

- 'గొట్టిపడియ' పునరావాస కాలనీలో రహదారుల నిర్మాణ పనుల్లో నిబంధనలకు తూట్లు
- చీమకుర్తి కంకరకు బదులుగా.. సుద్ద కంకర వాడకం

ప్రజాశక్తి-మార్కాపురం

'పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు' నిర్వాసిత పునరావాస కాలనీ నిర్మాణ పనులో అధికారుల సాక్షిగా అడ్డగోలు మోసాలు జరుగుతున్నాయి.. కాంట్రాక్టర్లకు తొత్తులుగా మారిన అధికారులకు ముడుపులు అందుతున్నట్లు తెలిసింది. ముడుపులు పుచ్చుకున్నందుకు స్వామి భక్తిని అధికారులు చాటుకుంటున్నారు. పనుల్లో నాణ్యత లేకున్నా పర్వాలేదు.. ముడుపులు అందించిన కాంట్రాక్టర్లకు లాభాలు చేకూరితే చాలన్నట్లుగా అక్కడి అధికారుల వ్యవహార శైలి కనిపిస్తోంది!

పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్టు ముంపులో గొట్టిపడియ గ్రామం ఉంది. ఆ గ్రామానికి పునరావాస కాలనీ మార్కాపురం మండలంలోని కోమటికుంట వద్ద స్థలాన్ని ఎంపిక చేశారు. ప్రస్తుతం అక్కడి పునరావాస కాలనీలో రహదారుల పనులు జరుగుతున్నాయి. రూ.27 కోట్లతో పునరావాస కాలనీలో సిమెంటు రహదారులతో పాటు మురుగు కాలువలు నిర్మించాల్సి ఉంది. సిమెంటు రహదారులతో పాటు మురుగు కాలువల నిర్మాణంలో కీలకమైన కంకర నాసిరకంగా ఉంది. నిర్మాణంలో చీమకుర్తి కంకర మాత్రమే వినియోగించాలని టెండరులో దాఖలు చేయడం జరిగింది. నాణ్యతలో చీమకుర్తి కంకరకు పోటీ మరొకటి లేదు. చీమకుర్తి నుంచి మార్కాపురం 70 కిలోమీటర్లకు పైగా దూరం ఉంది. దూరంతో పాటు చీమకుర్తి కంకర ధర కూడా ఎక్కువే. ప్రభుత్వం దానికి తగ్గట్టుగా అంచనాలే వేసింది. ఈ పనులను దక్కించుకున్న కాంట్రాక్టర్ మాత్రం చీమకుర్తి కంకరకు బదులుగా మార్కాపురం సమీపంలోని కంకరను వినియోగిస్తున్నారు. చీమకుర్తి కంకర ఒక్కో టిప్పర్ రూ.20 వేలు ఉండగా లోకల్ అందుబాటులో ఉన్న సుద్ద కంకర టిప్పర్ ఒకటి ధర రూ.8 వేలకు లభిస్తోంది. టెండరులో పొందుపర్చిన ధరల ప్రకారం ఒక్కో టిప్పర్ కంకరలో కాంట్రాక్టర్‌కు సుమారు రూ.10 వేల మిగులు కనబడుతోంది. ఈ పాటికే పునరావాస కాలనీలో సుద్ద కంకరతో రహదారుల బెడ్లన్నీ పూర్తి చేశారు. కొన్ని సిమెంటు రహదారులను కూడా సుద్ద కంకరతో పూర్తి చేయడం జరిగింది. ప్రస్తుతం మిగిలి ఉన్న రహదారుల పనులు జరుగుతున్నాయి. మురుగు కాలువల నిర్మాణం చేపట్టాల్సి ఉంది. ఈ పనులను వెలుగొండ ప్రాజెక్టు కంభం సబ్ డివిజన్‌లోని అధికారులు పర్యవేక్షిస్తున్నారు. ఈ పనుల్లో జరుగుతున్న అక్రమాలను అక్కడి అధికారులు పట్టించుకోవడం లేదు. కాంట్రాక్టర్ ఇష్టానుసారంగా అక్కడ పనులు చకచకా జరిగిపోతున్నాయి. ప్రస్తుతం జరుగుతున్న ▶ 2లో

సుద్ద కంకరతో నిర్మించిన రహదారి బెడ్డు

సుద్ద కంకరతో అధికారుల సాక్షిగా సాగుతున్న నిర్మాణ పనులు

భట్టిప్రోలు మండలం, సురేపల్లి వద్ద జగనన్న కాలనీకి వెళ్లటానికి రహదారి మార్గం సరిగా లేనప్పటికీ బురదలోనే కాలినడకన వెళుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

గృహాలు నిర్మించి ఇచ్చేందుకు సిద్ధం: కలెక్టర్

పరిపాలనా వ్యవస్థకు

రాజ్యాంగమే మూలాధారం

- కలెక్టర్ ఏఎస్.దినేష్ కుమార్
- ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

పరిపాలనా వ్యవస్థకు రాజ్యాంగమే మూలాధారమని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా స్థానిక హెచ్.సి.ఎం. కాలేజీ వద్ద ఉన్న రాజ్యాంగ ముసాయిదా కమిటీ చైర్మన్ డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి శనివారం ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. కలెక్టర్ మాట్లాడుతూ స్వాతంత్ర్యం నాటికి పలు సంస్థానాలుగా ఉన్న దేశ పరిస్థితులను గమనించి, భవిష్యత్తు అవసరాలను దష్టిలో ఉంచుకుని ఒక గొప్ప రాజ్యాంగాన్ని అంబేద్కర్ రూపొందించారని ఆయన కొనియాడారు. ఒంగోలు నగర మేయర్ గంగాడ సుజాత మాట్లాడుతూ రాజ్యాంగ స్ఫూర్తితో దేశాభివద్ధిలో ప్రతిఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వహించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏ.ఎస్‌పి నాగేశ్వరరావు, జిల్లా సాంఘిక సంక్షేమ అధికారి లక్ష్మానాయక్, డిఆర్‌డిఏ పీడీ బి.బాబూరావు, ఒంగోలు డిఎస్‌పి యు.నాగరాజు, ఒంగోలు మున్సిపల్ కమిషనర్ ఎం.వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కలెక్టర్, మేయర్

ఎందుకింత తర్జనభర్జన.!

(మొదటిపేజీ తరువాయి)

చేపట్టారు. అప్పటి నుంచీ పార్టీ టిక్కెట్ ఆశిస్తున్న అభ్యర్థులు పరీక్షలో ఉత్తీర్ణత కోసం 'ఎక్కే గడప..దిగే గడప..' అన్నట్లుగా తమ నియోజకవర్గాల్లో సచివాలయాల వారీగా పర్యటనలు చేశారు. జిల్లాలో అందరి కన్నా మిన్నగా పర్చూరు నియోజకవర్గం నుంచి రామనాథం బాబు పూర్తిస్థాయిలో గడపగడపకూ.. కార్యక్రమం చేపట్టారు. ఈ మేరకు సచివాలయ నిధులు కూడా పర్చూరుకు అధికంగానే మంజూరయ్యాయి. పార్టీ లెక్కల ప్రకారం చూస్తే వైసిపి అభ్యర్థిగా రామనాథంబాబు అందరికన్నా ముందున్నారు. కానీ పార్టీ అధినేత జగన్ రామనాథంబాబును మాత్రం అభ్యర్థిగా ఖరారు చెయ్యకుండా తర్జనభర్జన పడుతూనే ఉన్నారు. అద్దంకి, చీరాల స్థానాల వైసిపి టిక్కెట్లను కమ్మ సామాజికవర్గానికి చెందిన వారికి ఇవ్వనున్న నేపథ్యంలో పర్చూరు నుంచి కాపు సామాజికవర్గం వ్యక్తిని అభ్యర్థిగా నిలపాలనేది జగన్ ఆలోచనగా పార్టీ నేతలు చెబుతున్నారు. ఈ మేరకు చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్‌ను తెరపైకి తెచ్చారు. కానీ ఆమంచికి పర్చూరు నుంచి పోటీ చెయ్యడం ఇష్టం లేదు. ఎలాగైనా రానున్న ఎన్నికల్లో చీరాల నుంచే పోటీ చేయ్యాలనేది ఆమంచి ఆలోచనగా ఉంది. మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డికి కూడా ఆమంచి పర్చూరు ఇన్‌ఛార్జిగా రావడం ఇష్టం లేదన్న ప్రచారం ఉంది. పర్చూరు నుంచి కాపు అభ్యర్థిని ఎన్నికల బరిలోకి దింపాలన్న జగన్ ఆలోచన మేరకు కాపు సామాజిక వర్గానికి చెందిన ఒకరిద్దరిని బాలినేని ప్రతిపాదించినట్లు చెబుతున్నారు. ఇక్కడ వైసిపి అభ్యర్థి ఎంపికలో మాత్రం ప్రతిష్టంభన నెలకొంది. ఏడాదిన్నర కాలంగా పర్చూరు వైసిపి ఇన్‌ఛార్జీగా ఆమంచి పేరు ప్రచారంలో ఉంది గానీ అది కార్యరూపం దాల్చలేదు. అయినప్పటికీ రామనాథంబాబు ఇవేవీ పట్టించుకోకుండా 161 రోజులుగా నియోజకవర్గంలో గడపగడపకూ ప్రభుత్వం కార్యక్రమంలో ఇంటింటికీ తిరుగుతున్నారు. అద్దంకిలో రెండు పార్టీల తరఫున ఒకే సామాజికవర్గానికి చెందిన వారు పోటీ చేయనున్నందున అదే విధానంలో పర్చూరు నుంచి కూడా ఒకే సామాజికవర్గం వారు పోటీ చేస్తే వచ్చే ఇబ్బంది ఏమిటనేది రామనాథంబాబు వర్గీయుల వాదన.

అజ్ఞాతంలో ఆమంచి..

చీరాల మాజీ ఎమ్మెల్యే ఆమంచి కృష్ణమోహన్ గత కొంతకాలంగా అజ్ఞాతంలో ఉన్నారు. న్యాయమూర్తులపై అనుచిత వాఖ్యల కేసులో సిబిఐ అధికారుల ముందు ఆమంచి విచారణకు హాజరుకావలసి ఉంది. విచారణకు హజరయితే వారు అరెస్టు చేసి కోర్టులో ప్రవేశపెడతారు. అరెస్టు కాకుండా ఉన్నత న్యాయస్థానం ద్వారా ముందస్తు బెయిల్ కోసం ప్రయత్నాలు చేస్తున్నట్లు తెలుస్తోంది. ఈ కారణంగా ఆమంచి బయట ఎక్కడా ఎలాంటి బహిరంగ కార్యక్రమాల్లో పాల్గొనడం లేదు. అరెస్టు అయ్యి జైలుకు వెళ్ళి వస్తే సరిపోతుందని రాజకీయంగా కూడా లబ్ధి చేకూరుతుందని ఆమంచి భావిస్తున్నప్పటికీ పార్టి అధిష్టానం మాత్రం అరెస్టు అవ్వడం కాకుండా న్యాయస్థానం ద్వారా బెయిల్ పొందడం పైనే దృష్టి పెట్టినట్లు తెలుస్తోంది. పర్చూరు వైసిపి ఇన్‌ఛార్జిగా వెళ్లడం ఇష్టం లేనప్పటికీ పార్టి అధినేత జగన్ సూచన మేరకు తన అంగీకారం తెలిపినట్లు తెలుస్తోంది. పర్చూరుకు వెళ్లడం ఇష్టం లేని ఆమంచిని బలవంతంగా తెచ్చే కంటే పార్టీకి ప్రస్తుతం ఇన్‌ఛార్జిగా ఉన్న రామనాథంబాబే మేలు కదా? అని పార్టీ కార్యకర్తలంటున్నారు.

మహిళా రైతు సంఘాలకు తోడ్పాటు

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

గ్రామీణ ప్రాంతాలలోని సన్న, చిన్న కారు మహిళా రైతులు సంఘాలుగా ఏర్పడిన వారికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా తగిన తోడ్పాటు అందజేయటం జరుగుతుందని జిల్లా మహిళా రైతు ఉత్పత్తిదారుల సంఘం ఎపిఎం హనుమంతరావు తెలిపారు. స్థానిక డిఆర్‌డిఎ కార్యాలయం ఆవరణంలో మండలం పరిధిలోని అన్ని గ్రామాల్లో ఉన్న మహిళా రైతు ఉత్పత్తి దారుల సంఘాల సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా మార్కాపురం మండలంను ఎన్ఆర్‌యల్‌ఎం వారు ఎంపిక చేసుకున్నారని తెలిపారు. ఈ ఎంపిక ద్వారా రైతులకు ప్రభుత్వం కొన్ని సదుపాయాలు కల్పించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్ఆర్‌కెపి ఎపిఎం రమేష్ బాబు, సిసి మనోకుమారి, మండల సమాఖ్య అధ్యక్షురాలు జయమ్మ, రైతు మహిళా గ్రూపుల లీడర్లు, విఒఎలు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో రాజారెడ్డి రాజ్యాంగం

కొండపి శాసనసభ్యుడు డాక్టర్ స్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

రాష్ట్రంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగాన్ని తుంగలో తొక్కి వైఎస్ జగన్ తాత రాజారెడ్డి రాజ్యాంగాన్ని అమలు చేస్తున్నారని కొండపి ఎమ్మెల్యే డోలాశ్రీ బాలవీరాంజనేయ స్వామి విమర్శించారు. శనివారం మండలంలోని తూర్పునాయుడు పాలెం గ్రామంలో అంబేద్కర్ రాజ్యాంగం అమలు దినోత్సవం సందర్భంగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ఎమ్మెల్యే స్వామి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం మండల టిడిపి నాయకులు టంగుటూరు బస్ స్టాప్ సెంటర్ లోని అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పించి ప్రసంగించారు. ఈ కార్యక్రమంలో

అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే

తెలుగు రైతు రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి బెజవాడ వెంకటేశ్వర్లు,ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి ధర్నాసి బ్రహ్మానందం, మాజీ ఎంపీపీ చదలవాడ చంద్రశేఖర్, నాయకులు మేడికొండ రవీంద్ర, కసుకుర్తి భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

లింగ వివక్షకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి సంతనూతలపాడు రూరల్.

డిఆర్‌డిఎ వైఎస్ఆర్ క్రాంతి పథం ఆధ్వర్యంలో శనివారం సంతనూతలపాడులో లింగ వివక్షకు వ్యతిరేకంగా ర్యాలీ నిర్వహించి అనంతరం బస్టాండ్ సెంటర్లో మానవహారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైఎస్ఆర్ క్రాంతి పథం ఎపిఎం బి సుధాకర్ రావు మాట్లాడుతూ లింగ వివక్షకు అందరూ ముగింపు పలకాలని పేర్కొన్నారు. కార్యక్రమానికి ముందుగా స్థానిక వైఎస్ఆర్ కాంతి పథం కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు కార్యక్రమంలో ఎంపిపి బి విజయ జడ్‌పిటిసి దుంపా రమణమ్మ, స్థానిక సర్పంచి దర్శి నాగమణి, వైస్ ఎంపిపి టి రాగమ్మ, మైనంపాడు ఎంపిటిసి ఏ రాజకుమారి వివిధ గ్రామాల సర్పంచులు బి శైలజ, ఈ విజయలక్ష్మి, డి రమణ, తదితరులు పాల్గొన్నారు.

సమీకృత వ్యవసాయ పద్ధతులు అవలంబించాలి

ప్రజాశక్తి-దరిశి

సమీకృత సాగునీరు, వ్యవసాయ పద్ధతులు రైతులు అవలంభించి అధిక దిగుబడులు సాధించాలని రైతు శిక్షణ కేంద్రం ఎడిఎ ప్రభాకర్ అన్నారు. శనివారం దరిశి ఎడిఎ కె అర్జున్‌నాయక్ ఆధ్వర్యంలో మండలంలోని బొట్లపాలెం గ్రామంలో సమీకృత సాగునీరు, వ్యవసాయ పరివర్తనాపథకం గురించి రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా రైతులకు సలహాలు, సూచనలు అందించారు. ఈ కార్యక్రమంలో కెవికె శాస్త్రవేత్త కాశీవిశ్వనాధ్, ఎఒ బాలక్రిష్ణనాయక్, శిక్షకులు స్వర్ణలత, ప్రతాప్‌రెడ్డి, సుచీత రైతులు పాల్గొన్నారు

నిధులు గోల్‌మాల్

(మొదటిపేజీ తరువాయి)

ఖాతాకు జమయ్యాయి. ఎటువంటి వివరాలు లేకుండా రూ.3,53,166ను దొంగ బిల్లులు చూపి పూర్ణప్రసాద్ పేర జమ చేసినట్లు చూపారు. ఆ విధంగా సుమారు రూ.20 లక్షల మేర గోల్‌మాల్ అయినట్లు తేటతెల్లమైంది. పనులు జరిగితే చేసినవారి ఖాతాకు, కార్మికుల జీతాలు అయితే వారి ఖాతాకు జమ చేయాలి. కానీ ఏ సంబంధం లేని మర్రి పూర్ణప్రసాద్ ఖాతాలో జమచేయడం వెనక మతలబు ఏమిటనే విషయంపై ఆరా తీస్తే అతను ఇన్‌ఛార్జి ఇఒ వెంకటేశ్వర్లు కుమారుడు అని తేలింది. దీనిపై ఉన్నతాధికారులు విచారణ చేస్తున్నారు. పూర్తి విచారణలో మరింకెంత నిధులు దుర్వినియోగం అయ్యాయో తేలాల్సి ఉంది.

డిఎల్‌పిఒ విచారణ

అమ్మనబ్రోలు పంచాయతీలో జరిగిన అవినీతిపై గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు శనివారం డిఎల్‌పిఒ పద్మావతి విచారణ చేపట్టారు. సమాచార హక్కు చట్టం ద్వారా గ్రామస్తులు ఇచ్చిన సమాచారం ప్రకారం రూ.20 లక్షలు తేలగా ఇంకా ఎంబుక్‌లను పరిశీలిస్తుండగా మరికొంత నిధులు దుర్వినియోగం అయినట్లు తెలుస్తోంది. ఎంత మొత్తంలో అవినీతి జరిగిందో విచారణ పూర్తయితేనే తెలిసే అవకాశం ఉంది.

అధికారుల సాక్షిగా అడ్డగోలు మోసం.!

(మొదటిపేజీ తరువాయి)

పనుల్లో కంకరదే మేజర్ పాత్ర. లోకల్ కంకర వాడకాన్ని చూపి టెండర్లు దాఖలు చేసి ఉంటే ఇక్కడ వ్యయం రూ. 27 కోట్లు కాదు... రూ. 17 కోట్లకు మించదు. కేవలం ఒక్క కంకరలోనే రూ.10 కోట్లకు పైగా ప్రభుత్వానికి నష్టం జరుగుతోంది. గొట్టిపడియ పునరావాస కాలనీలో జరుగుతున్న అక్రమాలపై ఉన్నతాధికారులు దృష్టి సారిస్తే తప్ప నాణ్యత ఉండబోదని ఇక్కడి నిర్వాసితులు గగ్గోలు పెడుతున్నారు. ఆ దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు. కాంట్రాక్టర్ వత్తాసు పలుకుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.

గుండ్లకమ్మ నదిపై ఎత్తి పోతల పథకం నిర్మించాలి

ప్రజాశక్తి-మార్కాపురం

మార్కాపురం మండలంలోని బొందలపాడు గ్రామ సమీపంలో చల్లదిన్నె వద్దగల గుండ్లకమ్మ నదిపై ఎత్తిపోతల పథకాన్ని నిర్మించాలని, దీంతో రైతులకు ప్రయోజనం కలుగుతుందని ఎపి రైతు సంఘం నాయకులు యేర్వ పాపిరెడ్డి ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. బొందలపాడులో రైతులతో శనివారం నిర్వహించిన సమావేశంలో పాపిరెడ్డి పాల్గొని మాట్లాడారు. సమావేశంలో రైతులు టి.శివారెడ్డి, ఎస్.వెంకటేశ్వరరెడ్డి, నాగారపు నాగేశ్వరరావు, తవనం క్రిష్టారెడ్డి, పొదిలి నడిపి కాశయ్య పాల్గొన్నారు.

ఎన్‌సిసి సర్టిఫికెట్ల పంపిణీ

ప్రజాశక్తి-పిసి.పల్లి

జాతీయ సేవా విభాగంలో ఎన్‌సిసి శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు శనివారంఎన్‌సిసి సర్టిఫికెట్‌లను పంపిణీ చేశారు. ఉన్నత పాఠశాల స్థాయిలో ఎన్‌సిసి శిక్షణ పొందిన వారికి పరీక్షలు నిర్వహించి ఉత్తీర్ణులైన వారికి ఈ సర్టిఫికెట్‌లు అందజేసినట్లు పాఠశాల ఎన్‌సిసి అధికారి జివి మాల్యాద్రి తెలిపారు. ఈ సర్టిఫికెట్లు వారి చదువుకు, ఉద్యోగావకాశాలకు దోహదపడతాయని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె.శ్రీనివాసులు, హవల్దార్ రణబీర్‌సింగ్, హవల్దార్ శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ పోయినవి

చిర్లంచెర్ల ప్రసన్న తండ్రి: నారాయణ కు చెందిన ప్రకాశం జిల్లా పెద్దదోర్నాల మేజరు గ్రామ పంచాయతీ పరిధిలోని సర్వే నెంబరు 90/101/బి/సి లో 100 చ.గ. ఇంటి స్థలానికి సంబంధించిన డోర్ నెం:304-18ఎ లో రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ పెద్దదోర్నాల మండలంలోని వై. చెర్లోపల్లి నుంచి పెద్దదోర్నాలకు వస్తుండగా మార్గ మధ్యలో పోయినవి. వెదికినా కనిపించలేదు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్స్ నెంబరు: 1857/2011. ఎవరికైనా దొరికినయెడల తమకు అందజేయగలరని మనవి.

చిర్లంచెర్ల ప్రసన్న
తండ్రి: నారాయణ
సెల్: 9160040689.

మహారాజశ్రీ మార్కాపురం ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి వారి కోర్టులో

ఓ.ఎస్ నెం: 116/2020

బీసా శ్రీనివాసులు ... వాది

వర్సెస్

పొదిలి కాశయ్య ..... ప్రతివాది

టు,
పొదిలి కాశయ్య, తండ్రి: వెంకటయ్య
బ్రిలియంట్ స్కూల్ దగ్గర,
కరెంటు ఆఫీసు ప్రక్కన
తర్లుపాడు రోడ్డు, మార్కాపురం గ్రామం మరియు మండలం.

నోటీసు

పై దావా మీపై దావా ప్రామిసరి నోటు నిమిత్తం దావా వేసినారు. అట్టి దావా నందు ఎన్నిసార్లు నోటీసులు పంపించిననూ అందుకొనక కాలాయాపన చేయుచున్నారు. అందుచే శ్రీ కోర్టులో మీ హాజరు నిమిత్తం తేదీ: 09-12-2022న ఉదయం 10:30 గంటలకు పై కోర్టు వారి ముందు స్వయముగా గానీ, అడ్వకేట్ గారి ద్వారా గానీ హాజరై మీ ఆక్షేపణలు తెలుపుకొనవలసినది. లేనియెడల మీ పరోక్షమున దావాను తీర్మానించబడును.

(శ్రీ కోర్టు వారి ఉత్తర్వుల మేరకు)

దొడ్డా సత్యనారాయణరెడ్డి
అడ్వకేట్, మార్కాపురం
సెల్: 9133007089.

ప్రతి ఇంటికీ మంచినీటి సరఫరా

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

ప్రతి ఇంటికీ ఉచితంగా ప్రభుత్వం మంచినీరు సరఫరా చేయటం జరుగుతుందని అందుకు సంబంధించిన వివరములుమ త్వరితగతిన సమర్పించాలని ఆర్‌డబ్ల్యూఎస్ ఎఇ ప్రతాప్ రెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం ఆవరణంలో జల్ జీవన్ మిషన్‌పై పంచాయతీ కార్యదర్శులకు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఇ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి ఇంటికీ కుళాయి ద్వారా ఉచితంగా మంచి నీటిని అందించాలని దఢ సంకల్పంతో ఉందని అందుకు తగిన విధంగా అంచనాలను తయారు చేసి ప్రభుత్వానికి పంపించడం జరిగిందన్నారు. కావున పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు సమన్వయంతో మండల వ్యాప్తంగా ఉన్న అన్ని గ్రామాల్లోని ప్రతి ఇంటికీ వెళ్లి ఇంటి యజమాని యొక్క ఆధార్ కార్డు, పన్ను రసీదులను సేకరించాలన్నారు ఇందుకోసం వాలంటీర్లనుసైతం ఉపయో గించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఒ తోట చందన, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

వేలం ప్రకటన

మహారాజశ్రీ ఒంగోలు 3వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో

E.P.No.13/2018 in
M.V.O.P.N0.380/2007

Between :

మండూరి శివకుమారి వగైరాలు .... డిక్రీ హెూల్డర్స్

మరియు

వంకాయలపాటి జ్యోత్స్నాదేవి ...జడ్జిమెంటు డెట్టార్సు

పై కేసులో జడ్జిమెంటు డెట్టార్లు తాలూకు షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని పై కోర్టు ఆవరణలో తేది.16-12-2022న ఉదయం గం॥ 10-30 ని॥లకు నుండి వేలం వేయబడును. వేలంలో ఎవరైననూ పాల్గొనవచ్చును. వేలంలో పాల్గొనదలచినవారు, ఇంకా యితర వివరముల కొరకు డిక్రీ హెూల్డరు గారి అడ్వకేటు గారిని తన ఆఫీసులో సంప్రదించగలరు.

షెడ్యూలు

అయిటం నెం.1 : ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్ - అద్దంకి సబ్ రిజిష్టార్ - జె.పంగులూరు మండలం - పంగులూరు గ్రామం - సర్వే నెం.685లోని య.1-91 ట్ల భూమికి హద్దులు :

తూర్పు : తల్లపనేని నాగేశ్వర రావు మరియు యితరుల భూములు
దక్షిణం : సర్వే నెం.683/1 తాలూకు భూమి
ఉత్తరం : తల్లపనేని లక్ష్మి గారి భూమి
పడమర : గుర్రం రామదాసు గారి భూమి

ఈ హద్దులలోని య.1-91 ట్ల భూమి.

DHR విలువ రూ.2,00,000/-
కోర్టు అమినా విలువ రూ.10,00,000/-
మార్కెట్టు విలువ రూ.9,93,200/-

అయిటం నెం.2 : ప్రకాశం జిల్లా రిజిస్ట్రేషన్ - అద్దంకి సబ్ రిజిష్టార్ - జె.పంగులూరు మండలం - పంగులూరు గ్రామం - సర్వే నెం.683/1లోని య.1-48 ట్లకు హద్దులు :

తూర్పు : తల్లపనేని నాగేశ్వర రావు మరియు యితరుల భూములు
దక్షిణం : ఎన్.యస్.పి.కాలువ
ఉత్తరం : సర్వే నెం.685 లోని భూమి
పడమర : గుర్రం రామదాసు గారి భూమి

ఈ హద్దులలోని య.1-48 ట్ల భూమి.

DHR విలువ రూ.1,50,000/-
కోర్టు అమినా విలువ రూ.9,50,000/-
మార్కెట్టు విలువ రూ.7,69,600/-
వేలం తేది. : 16-12-2022
తదుపరి విచారణ వాయిదా : 26-12-2022

// కోర్టు వారి అనుమతితో //

ఇట్లు,
పవని శ్రీరామయ్య బి.ఏ.బి.యల్.
అడ్వకేట్, ఒంగోలు.
సెల్ - 9247777318

గ్రంథపాలకుడిపై చర్యలు తీసుకుంటా

జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కోటేశ్వరి

ప్రజాశక్తి-పంగులూరు

ఉద్యోగ బాధ్యతలు మరిచిపోయి గ్రంథాలయానికి రాకుండా కాలం గడుపుతున్న పంగులూరు గ్రంథపాలకుడు సంజయ్‌బాబుపై తక్షణమే చర్యలు తీసుకుంటామని ఉమ్మడి ప్రకాశం జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి కోటేశ్వరి అన్నారు. పంగులూరులోని గ్రంథాలయం కొంతకాలంగా పనిచేయట్లేదని, గ్రంథపాలకుడు డ్యూటీకి రావడం లేదని, గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కోటేశ్వరి శనివారం ఉదయం గ్రంథాలయాన్ని పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. గ్రంథపాలకుడిపై గ్రామస్తులు చేస్తున్న విమర్శలను విన్న కోటేశ్వరి పంచాయతీ కార్యాలయానికి వచ్చి అక్కడ గ్రామస్తులు ఇచ్చిన ఫిర్యాదులు స్వీకరించారు. అనంతరం కోటేశ్వరి మాట్లాడుతూ, కొంత కాలంగా పంగులూరులో గ్రంథాలయానికి గ్రంథపాలకుడు రాని కారణంగా, గ్రంథాలయం మూతబడిపోయి ఉందని పేర్కొన్నారు. ఈ కారణంగా అతనిపై వెంటనే తగు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గ్రంథపాలకుడు సక్రమంగా

గ్రామస్తులతో చర్చిస్తున్న జిల్లా గ్రంథాలయ సంస్థ సెక్రటరీ కోటేశ్వరి

డ్యూటీ చేయని కారణంగా, ఇటీవల జరగాల్సిన గ్రంథాలయ వారోత్సవాలు కూడా ఇక్కడ జరగలేదని కోటేశ్వరి తెలిపారు. గ్రంథాలయానికి ఇటీవల 12 వందల పుస్తకాలను ఇచ్చామని, వాటితోపాటు దాతలు ఇచ్చిన టీవీ, వాటర్ ఫిల్టర్, మోటర్, ఫ్యాన్లు, మరికొన్ని వస్తువులు కూడా గ్రంథాలయంలో ఉన్నాయని, గ్రంథపాలకుడు లేకపోవటం వలన ఇవన్నీ నిరుపయోగంగా ఉన్నాయన్నారు. పంగులూరు పంచాయతీ నుంచి గ్రంథాలయ పన్ను కింద 11 సంవత్సరాలకు గాను, ఇటీవల 7 లక్షల రూపాయలు తమకు జమ చేశారని కోటేశ్వరి తెలిపారు. ప్రజల నుంచి గ్రంథాలయ పన్ను వసూలు చేస్తున్నా గ్రంథాలయం నిర్వహణ సక్రమంగా లేకపోవడం సరైనది కాదని ఆమె చెప్పారు. పంగులూరు గ్రంథాలయానికి పర్మినెంట్ గ్రంథ పాలకుడిని నియమించాలని గ్రామస్తులు కోరగా 2012లో గ్రంథ పాలకుల కోసం ప్రభుత్వం నోటిఫికేషన్ ఇచ్చిందని, అయితే కొన్ని కారణాల వలన ఆ నోటిఫికేషన్ ఆగిపోయిందని చెప్పారు. త్వరలో మళ్లీ నోటిఫికేషన్ వస్తుందని, ఆ పోస్టుల భర్తీలో పంగులూరు గ్రంథాలయానికి కూడా పర్మినెంట్ గ్రంథ పాలకుడిని నియమించే అవకాశం ఉందని కోటేశ్వరి తెలిపారు. ఈ కార్యక్రమంలో పంగులూరు గ్రామ మాజీ సర్పంచ్ పూల లక్ష్మి ప్రసాద్, సిపిఎం మండల కార్యదర్శి తలపనేని రామారావు, గ్రామపంచాయతీ కార్యదర్శి లామ్ సునీత, గ్రామ వైసిపి నాయకుడు గుడిపూడి రామారావు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న జంజనం శ్రీనివాసరావు

జగనన్న మహిళా మార్టులకు శ్రీకారం

ప్రజాశక్తి-చీరాల

రాష్ట్రవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా మహిళా సంఘాల సహకారంతో ఏర్పాటుకు తలపెట్టిన జగనన్న మహిళా మార్టును పురపాలక సంఘంలో ఖాళీ భవనంలో త్వరలో ఏర్పాటు చేయనన్నట్లు మున్సిపల్ చైర్మన్ జంజనం శ్రీనివాసరావు అన్నారు. శనివారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో ప్రాజెక్ట్ డైరెక్టర్ తేళ్ల రవికుమార్ ఐబి అండ్ ఎల్‌హెచ్ వై చంద్రశేఖర్, మహిళా సంఘాలు, మున్సిపల్ కౌన్సిల్, పలు శాఖల అధికారులతో ప్రత్యేక సమావేశం జరిగింది. లింగ ఆధారిత వివక్షపై మెప్మా విభాగం మహిళా సంఘాలతో జాతీయ స్థాయి ప్రచారంలో భాగంగా అవగాహన కార్యక్రమం జరిగింది. అనంతరం రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఏసయ్య, టిఎల్ఎఫ్ అధ్యక్షురాలు రంగనాయకమ్మ, చీరాల సీఎంఎంలు కే రాణి, ఫణి కుమారి, పలువురు సిబ్బంది పాల్గొన్నారు.

న్యాయవిజ్ఞాన సదస్సు

ప్రజాశక్తి-అద్దంకి

రాజ్యాంగ మరియు న్యాయ దినోత్సవం సందర్భంగా సింగరకొండ గురుకుల కళాశాలలో శనివారం న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బార్ అసోసియేషన్ అధ్యక్షులు నాదెండ్ల హరిబాబు అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథులుగా సీనియర్ సివిల్ జడ్జి బి బాబు నాయక్ హాజరై మాట్లాడుతూ విద్యార్థులు చట్టాల పట్ల అవగాహన పెంచుకోవలసిన అవసరం ఉందని పేర్కొన్నారు. మంచి ప్రవర్తన ఉండే విధంగా నడుచుకోవాలన్నారు. రాజ్యాంగంలో ప్రజలకు అవసరమైన చట్టాలు ఉన్నాయన్నారు. వరకట్నాన్ని కూడా వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. గురుకుల కళాశాలలో మంచి వాతావరణంలో క్రమశిక్షణతో పాటు విద్యార్థులు చక్కగా విద్యను అభ్యసించాలన్నారు. ప్రాథమిక హక్కులు, బాధ్యతల గురించి తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఎం బుజప్ప, అడిషనల్ జూనియర్ సివిల్ జడ్జి ప్రియదర్శిని, ఏపీపీ కుసుమల్లత ఏజీపీ వై రమేష్‌బాబు, న్యాయవాదులు పి దుర్గ, గాయత్రి, కె బాలాజీ తదితరులు పాల్గొన్నారు

యద్దనపూడి: యద్దనపూడి గురుకుల పాఠశాలలో శనివారం రాజ్యాంగ ఆమోద దినోత్సవం, వరకట్న వ్యతిరేక దినోత్సవం సందర్భంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. సదస్సుకు గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె ప్రమీల అధ్యక్షత వహించారు. పర్చూరు కోర్టు జడ్జి కుమిదిని మాట్లాడుతూ బాలికలకు కూడా రక్షణ చట్టాలు ఉన్నాయని చెప్పారు. విద్యార్థినులు కూడా చట్టాలపై అవగాహన పెంచుకోవాలని అన్నారు. వరకట్నం తీసుకోవడం, ఇవ్వడం నేరమని అన్నారు. కార్యక్రమంలో యద్దనపూడి ఎస్ఐ రత్న కుమారి, పోలీసు సిబ్బంది శివకుమార్, బాలకృష్ణ, రవి, అనిత, పాఠశాల సిబ్బంది విద్యార్థినులు పాల్గొన్నారు.

.క్షీర విప్లవసారథి వర్గిస్ కురియన్‌కు నివాళి

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

భారత దేశంలో క్షీర విప్లవ సారథి డాక్టర్ వర్గీస్ కురియన్ జయంతి శనివారం నేషనల్ మిల్క్ డే ను బాపట్ల ఫుడ్ సైన్స్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు.. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ జాన్‌వెస్లీ ఆదేశాల మేరకు పాలు, పాల ఉత్పత్తుల విభాగం డైరెక్టర్ డాక్టర్ సిహెచ్‌వివి సత్యనారాయణ, డాక్టర్ విమల బీర ఆధ్వర్యంలో బాపట్ల డాక్టర్ ఎన్టీఆర్ ఆహార విజ్ఞాన కళాశాల అనుభవపూర్వక అభ్యాసంలో పాలు, పాల ఉత్పత్తుల విభాగం విద్యార్థులకు పాల యొక్క విశిష్టతకు వాటి పోషక విలువలను గురించి తెలియజేశారు. బాపట్ల పబ్లిక్ స్కూల్, నారాయణ, ప్రభుత్వ పాఠశాలలోని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పోషక విలువల ఆధారిత పదార్థాలైన క్లస్టర్ బాదంపాలు, ఫ్లేవర్డ్ మిల్క్ మొదలగు పదార్థాలను సందర్శనకు స్టాల్స్‌ను ఏర్పాటు చేశారు.

సూరగాని లక్ష్మికి సన్మానం

ప్రజాశక్తి-చీరాల

సూరగాని లక్ష్మికి సన్మానిస్తున్న సచివాలయ సిబ్బంది

బీసీ సేన రాష్ట్ర మహిళా అధ్యక్షురాలుగా ఇటీవల పదవి బాధ్యతలు చేపట్టిన ఐదవ వార్డ్ వైసిపి కౌన్సిలర్ సూరగాని లక్ష్మిని ఆ వార్డు సచివాలయ సిబ్బంది శనివారం సత్కరించారు. పేరాల శివాలయం సమీపంలో ఉన్న స్థానిక సచివాలయంలో సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించి మాట్లాడారు. నేడు రాష్ట్రంలో బిసి మహిళలు అభివద్ధికి కషి చేసే విధంగా బీసీ సేన మహిళా అధ్యక్షురాలుగా రాష్ట్ర అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య నియమించటం హర్షణీయమన్నారు. అనంతరం సూరగాని లక్ష్మి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం బీసీ మహిళల అభివృద్ధికి అందిస్తున్న సంక్షేమ పథకాలు ప్రజలకు సక్రమంగా అందించే విధంగా హాస్టల్స్‌లో విద్యార్థుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి మెరుగైన వసతులను విద్యార్థులకు అందించేందుకు కృషి చేయనున్నట్లు ఆమె తెలిపారు. ముందుగా రాజ్యాంగం ఆమోదం దినోత్సవం సందర్భంగా అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో సచివాలయం అడ్మిన్ బ్రహ్మయ్య, సిబ్బంది జెట్టి కుమార్, కట్టా శ్రీనివాసరావు, కొమ్మూరి స్టీవెన్ జోసెఫ్, మొగిలి విజయకృష్ణ, కుంబా అనిత, షేక్ రంజాన్‌బి, గోపి తదితరులు పాల్గొన్నారు.

పట్టణ నడిబొడ్డులో మురుగు నీరు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

రోడ్లపై ప్రవహిస్తున్న మురుగు నీరు

బాపట్ల పట్టణంలోని గడియార స్తంభం వద్ద మురుగునీరు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లు తోంది. గత కొన్ని రోజులుగా ప్రధాన రహదారిపై నీరు నిలిచిపోయి వాహనదారులకు పాదచారులకు ఇబ్బందికరంగా మారినా అధికారు లు ఏమాత్రం పట్టించుకోకపోవడం లేదు. నిర్లక్ష్యపు విధి నిర్వహణకు తావిస్తుందని ప్రజలు బహిరంగంగా మాట్లాడుతున్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా రహదారిలో వెళ్తున్న కూడా పట్టించుకోకపోవడం ఏమిటని చుట్టుపక్కల షాపుల యజమానులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓపక్క విద్యుత్ స్తంభాలకు విద్యుత్ కాంతులు వెలిగిస్తున్న అధికారులు మురుగునీరు పోయే అవకాశం లేకుండా బాపట్ల మొత్తం కంపుకొట్టే విధంగా చూడడం ఆశ్చర్యానికి గురిచేస్తోందని అంటున్నారు. సంబంధిత అధికారులు వెంటనే మురుగునీరు తొలగించి దుర్వాసన లేకుండా బ్లీచింగ్ చల్లించాలని ప్రజలు కోరుతున్నారు.

ఆర్‌సి భూములు పేదలకు పంపిణీ చేయాలి

ప్రజాశక్తి-భట్టిప్రోలు

రావిలంక ఆర్‌సి భూములు పరిశీలిస్తున్న రైతులు

కృష్ణా నది పరివాహక ప్రాంతంలో ఉన్న రావిలంక ఆర్‌సి భూములు అన్యాక్రాంతం అవుతున్న దృష్ట్యా ఆ భూములను ప్రభుత్వం సమీపంలోని 6 గ్రామాల పేదలకు పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సుమారు వెయ్యిమంది భూములను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లు గా ఆర్‌సి భూములు పంచాలని డిమాండ్ చేస్తున్నప్పటికీ అధికారులు పట్టించుకోవడం లేదని అక్రమార్కులు అన్యాక్రాంతం చేస్తుంటే చూసీచూడనట్లుగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పటికైనా భూములు పంపిణీ చెయ్యకపోతే ఆందోళన బాట చేపట్టాల్సి ఉంటుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామ సర్పంచులు, ఎంపిటిసిలు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

చల్లా నారాయణ (ఫైల్)

గిద్దలూరు మండలం కొండపేట గ్రామానికి చెందిన చల్లా నారాయణ(23) శనివారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. నారాయణ గిద్దలూరు నుంచి కూలి పని మీద ద్విచక్ర వాహనంపై ముండ్లపాడు గ్రామానికి వెళుతుండగా, ద్విచక్రవాహంలో పెట్రోల్ అయిపోవటంతో వాహనాన్ని నెట్టుకుంటూ వెళుతుండగా ముండ్లపాడు పెట్రోల్ పంప్ దగ్గర వెనుక వైపు నుంచి ట్రాక్టర్ ఢీ కొట్టడంతో నారాయణ అక్కడకక్కడే మృతి చెందాడు. ట్రాక్టర్ డ్రైవర్ నిర్లక్ష్యం, అతివేగం వలన ఈ ప్రమాదం జరిగినట్లు గుర్తించారు. మృతుడు నారాయణకు అనారోగ్యంతో ఉన్న తల్లి, వివాహం నిశ్చయమైన చెల్లెలు ఉన్నారు. నారాయణ మరణంతో ఆ కుటుంబం అనాథ అయింది. పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని కేసు నమోదు చేసుకుని విచారణ చేస్తున్నారు.

అనుమానంతో భార్యపై హత్యాయత్నం

ప్రజాశక్తి-పిసిపల్లి

భర్త చేతిలో గాయపడిన జ్యోతి

భార్యపై అనుమానంతో సుత్తితో తలపగులకొట్టి హత్యాయత్నం చేసిన సంఘటన మండలంలో శనివారం వేకువజామున చోటు చేసుకుంది. వివరాల ప్రకారం.. మండలంలోని పెదఒరిమడుగుకు చెందిన కొత్తపల్లి జ్యోతి, పోలీశ్వరరావు భార్యభర్తలు. గత కొంతకాలంగా గతంలో జరిగిన ఓ సంఘటన మూలంగా పోలీశ్వరరావు తన భార్యపై అనుమానం పెంచుకున్నాడు. వీరు కొంతకాలంగా గొడవలు పడుతున్నారు. ఈ క్రమంలో శనివారం వేకువజామున జ్యోతిని పోలీశ్వరరావు హత్య చేసేందుకు తలపై సుత్తితో కొట్టారు. జ్యోతి పెద్దగా అరవడంతో ఇరుగుపొరుగు వారు అక్కడకు చేరడంతో అతను వెళ్లిపోయాడు. 108 ద్వారా ఆమెను కనిగిరి వైద్యశాలకు తీసుకెళ్లగా మెరుగైన వైద్యం కోసం ఒంగోలుకు తరలించారు.

కొప్పరంలో సైబర్ నేరం
మోసపోయిన కుటుంబం

ప్రజాశక్తి-సంతమాగులూరు

మండలంలోని కొప్పరం గ్రామంలో నివాసముంటున్న కాంద్రగుంట ప్రకాష్‌రావు, అతని భార్య కోటేశ్వరమ్మ, శనివారం సాయంత్రం సమయంలో సైబర్ మోసగాళ్ల ఉచ్చులో పడి తమ బ్యాంకు ఖాతాలో ఉన్న 62,260 రూపాయలు పోగొట్టుకున్నట్లు గుర్తించారు. బాధితులు తెలిపిన వివరాల ప్రకారం.. శనివారం సాయంత్రం 5 గంటల సమయంలో గుర్తు తెలియని వ్యక్తి, 9990680693 ఫోన్ నెంబర్‌తో కోటేశ్వరమ్మకు ఫోన్ చేసి నీవు డాక్రా గ్రూపులో ఉన్నావా అని అడిగాడు. ఉన్నానని కోటేశ్వరమ్మ తెలిపింది. ఎంతసేపు ఫోన్ చేసినా ఫోన్ ఎత్తలేదేమిటని ఆ వ్యక్తి ప్రశ్నించాడు. ఇందుకు కోటేశ్వరమ్మ మీరు ఎవరు ఏమిటని వివరాలు అడిగింది. నేను అమరావతి రాజధాని సెక్రటరీ అని అన్నాడు. డ్వాక్రా గ్రూపులకు డబ్బులు వేశాం మీ ఖాతాలో పడ్డాయా అని అడిగాడు. ఇందుకు కోటేశ్వరమ్మ తన భర్త ప్రకాష్‌రావు వేరే ఊరికి వెళ్ళాడని, తన భర్తతో మాట్లాడి చెబుతానని ఆ వ్యక్తికి తెలిపింది. గుర్తు తెలియని వ్యక్తి తన భర్త ఫోన్ నెంబర్ చెప్పమని అడిగాడు. ఫోన్ నెంబర్ చెప్పగా ప్రకాష్‌రావుకు ఫోన్ చేశాడు. నీ బ్యాంకు ఖాతాలో డబ్బులు పడ్డాయా అని అడిగాడు. అందుకు ప్రకాష్‌రావు నా బ్యాంకు ఖాతాలో ఎలాంటి డబ్బులు పడలేదు అన్నాడు. ఆ వ్యక్తి నీ ఖాతాలో ఎంత డబ్బులు ఉన్నాయో చెప్పమన్నాడు. అందుకు ప్రకాష్ రావు 85,260 రూపాయలు ఉన్నట్టు తెలిపాడు. అలాగైతే ఇప్పుడే నీ బ్యాంకు ఖాతాకి డబ్బులు జమ చేస్తున్నానని తెలిపి, ముందుగా 60,020 రూపాయలు ప్రకాష్‌రావు ఖాతాకి జమ చేశాడు. తర్వాత 20,015 రూపాయలు జమ చేశాడు. దీంతో ప్రకాష్‌రావు ప్రభుత్వం తమకు సహాయం చేసిందని నమ్మాడు. తర్వాత సెల్ ఫోన్‌లో తన ఖాతాలో ఉన్న డబ్బులను తనిఖీ చేయగా, 23 వేల రూపాయలు మాత్రమే మిగిలి ఉన్నాయి. రూ.62,260 గల్లంతయ్యాయని, తాము మోసపోయామని గుర్తించి స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు.

వైట్ బర్లీ సాగుకు రైతుల మొగ్గు

- పెరగనున్న సాగు విస్తీర్ణం
- నారుకు డిమాండ్

ప్రజాశక్తి-పర్చూరు

వైట్ బర్లీ పొగాకు సాగు చేసేందుకు ఎక్కువ మంది రైతులు మొగ్గు చూపుతున్నారు. దీంతో వైట్ బర్లీ పొగ నారుకు రెక్కలొచ్చాయి. గత ఏడాదితో పోలిస్తే నారు ధర రెట్టింపు పలుకుతోంది. అయినప్పటికీ నారు కోసం రైతులు నానా తంటాలు పడుతున్నారు. కొనుగోలు చేసిన నారులో నాసిరకం మొక్కలు ఉండటంతో గ్రేడింగ్ చేసుకోవటానికి కూడా అధికంగా కూలి చెల్లించాల్సి వస్తుందని రైతులు వాపోతున్నారు. 4 వేల మొక్కలున్న నారు మూట రు. 4 వేల పలుకుతోంది. ఎకరంలో సాగు చేయడానికి సుమారు 6 నుంచి 7 వేల మొక్కలు అవసరమవుతాయి. దీంతో నారు కోసం ఎకరానికి రూ.7 వేల నుంచి 8 వేల వరూ ఖర్చు చేయాల్సి వస్తుందని రైతులు చెబుతున్నారు. నాట్ల కూలితో కలుపుకొని ఎకరానికి రూ.10 వేలు పైగా ఖర్చు పెట్టాల్సి వస్తుందని రైతులు తెలిపారు. దుక్కి దున్నటం, వ్యవసాయ ఖర్చులతో సాగు ప్రారంభ దశలోనే ఎకరానికి రూ.20 వేల వరకూ ఖర్చవుతుందని రైతులు తెలిపారు.

ధర ఎక్కువగా ఉండటంతో సాగుపై దృష్టి

గతేడాది వైట్ బర్లీ పొగాకు క్వింటా ధర రూ.13 వేలకు పైగా పలికింది. తొలి దశలో నాణ్యవంతమైన పొగాకు క్వింటా రూ.8 వేల నుంచి రూ.9 వేలకు అమ్ముడు పోయింది. ఎక్కువ మంది రైతులు ఇదే ధరకు వైట్‌బర్లీ పొగాకును అమ్ముకున్నారు. అయితే చివరి దశలో వైట్ బర్లీకి డిమాండ్ వచ్చింది. క్వింటా రూ.13 వేలు పలికింది. దీంతో ఎక్కువమంది రైతులు ఈ ఏడాది వైట్ బర్లీ సాగు చేసేందుకు సన్నద్ధమయ్యారు. మిర్చి పైరుకు సాగు ప్రారంభంలోనే తెగుళ్ల సోకడం, పత్తి సాగు నామమాత్రంగా ఉండటంతో రబీలో వైట్ బర్లీ సాగు చేసేందుకు సిద్ధమవుతున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు నారుమళ్లు దెబ్బతిన్నాయి. దీంతో నారుకు డిమాండ్ పెరిగింది. రైతులు నారు కోసం ఉరుకులు, పరుగులు పెడుతున్నారు. పొగనారు కోసం మార్టూరు, ద్రోణాదుల గ్రామాలకు రైతులు పరుగులు తీస్తున్నారు. గతేడాది పర్చూరు సబ్ డివిజన్ పరిధిలో 15 వేల ఎకరాల్లో వైట్ బర్లీ సాగు చేశారు. ప్రస్తుత పరిస్థితుల్లో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగే అవకాశం ఉందని రైతులు, వ్యవసాయ శాఖ అంచనాలు వేస్తున్నారు.

పర్చూరు ప్రాంతంలో వైట్ బర్లీని గ్రేడ్ చేస్తున్న మహిళా కూలీ

పర్చూరు ప్రాంతంలో వైట్ బర్లీ సాగుకు సన్నద్ధమైన రైతులు



ప్రజలతో మాట్లాడుతున్న మోపిదేవి వెంకట రమణారావు

పారదర్శకంగా సంక్షేమ పథకాలు: మోపిదేవి

ప్రజాశక్తి-రేపల్లె: ప్రతి ఇంటికి సంక్షేమ పథకాలను అందించేందుకే సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి గ్రామ సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారని రాజ్యసభ సభ్యుడు, వైసీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు మోపిదేవి వెంకటరమణారావు పేర్కొన్నారు. మండలంలోని మొర్తోట గ్రామంలో శనివారం జరిగిన గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో మోపిదేవి పాల్గొని ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎంపీ మోపిదేవి మాట్లాడుతూ గ్రామ సచివాలయ వ్యవస్థతో ప్రభుత్వ సంక్షేమ పథకాలు పారదర్శకంగా, ఎలాంటి అవినీతికి తావు లేకుండా నేరుగా ప్రజలకు అందుతున్నాయన్నారు. ఎన్నికల హామీలను 98 శాతం పైగా అమలు చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి బొర్రా లక్ష్మీ శ్రీనివాసరావు, సర్పంచ్ మంత్రాల శ్రీను, రూరల్ కన్వీనర్ గాదె వెంకయ్య బాబు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేడు వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా మహాసభ

ప్రజాశక్తి-మేదరమెట్ల

బాపట్ల జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం మహాసభ చిన్నగంజాం గ్రామంలోని ఐటిఐ కాలేజీ ఆవరణలో ఆదివారం ఉదయం 10 గంటలకు జరుగుతున్న విషయం పాఠకులకు తెలిసిందే. ఈ జిల్లా మహాసభకు రాష్ట్ర వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వి వెంకటేశ్వర్లు, ప్రకాశం జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి కంకణాల ఆంజనేయులు, గుంటూరు జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కార్యదర్శి ఈమని అప్పారావు పాల్గొననున్నారు. ఉమ్మడి ప్రకాశం జిల్లాలో మూడు నియోజకవర్గాలు, గుంటూరు జిల్లాలో మూడు నియోజకవర్గాలను కలిపి బాపట్ల అనే కొత్త జిల్లాను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. ఈ ఆరు నియోజకవర్గాలలో వ్యవసాయ కార్మికులు, వ్యవసాయ కూలీలు ఎక్కువగా ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఏర్పాటయిన తరువాత మొట్టమొదటి సమావేశం ఈ ప్రాంతంలోనే జరిగిందని పేర్కొన్నారు. ఈ సంఘ ఏర్పాటులో కృషి చేసిన కొరిశపాడు మండలానికి చెందిన మాజీ శాసనసభ్యులు తవనం చెంచయ్య ఈ ప్రాంతానికి చెందినవారే. చందలూరు భూ పోరాటం వంటి ఉద్యమాలకు ఈ ప్రాంతం ప్రాణం పోసింది. నేడు చిన్నగంజాం గ్రామంలో జరగబోయే వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రథమ మహాసభకు నిర్ణయించిన సమయంలో ప్రతినిధులంతా హాజరవ్వాలని జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం సమన్వయ కమిటీ కన్వీనర్ ఎం ఆంజనేయులు కోరారు.

డాక్టర్ శ్రీనివాస్‌కు పుచ్చలపల్లి సుందరయ్య స్మారక అవార్డు

ప్రజాశక్తి-బాపట్ల రూరల్

ప్రజా వైద్యులు ప్రజారోగ్యమే పరమావధిగా సాహిత్యంతో తమ రచనల ద్వారా ప్రజలకు ఆరోగ్యం పట్ల చైతన్యవంతుల్ని చేస్తూ వైద్య సేవలు అందిస్తున్న బాపట్లకు చెందిన డాక్టర్ శ్రీనివాస్ పుచ్చలపల్లి సుందరయ్య స్మారక అవార్డుకు ఎంపికయ్యారు. విజయవాడకు చెందిన మానస సాహిత్య సాంస్కృతిక అకాడమీ శ్రీనివాస్‌ను ఈ అవార్డుకు ఎంపిక చేసింది. ఈ నెల 27న విజయవాడ గాంధీనగర్ ప్రెస్‌క్లబ్‌లోజరిగే ప్రత్యేక కార్యక్రమంలో ఈ అవార్డును ప్రదానం చేస్తున్నట్లు అకాడమీ అధ్యక్షులు సిహెచ్‌విఎస్ బ్రహ్మానందరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. సాహితీ, సేవా, సాంస్కృతిక రంగాల్లో విశిష్ట నిష్ణాతులైన పలువురికి ఈ అవార్డులను ప్రదానం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. వారిలో బాపట్లకు చెందిన డాక్టర్ శ్రీనివాస్ ఒకరని బ్రహ్మానందరావు ప్రకటించారు. ఈ మేరకు తమకు ఆహ్వానం అందినట్లు డాక్టర్ శ్రీనివాస్ బాపట్లలో విలేకరులకు తెలిపారు. ఐదు దశాబ్దాలుగా ప్రజలకు ఆరోగ్యం పట్ల తమ రచనల ద్వారా చైతన్యపరుస్తూ సంచార వైద్యశాల ద్వారా ప్రజలకు అందిస్తున్న ఆరోగ్య, సాహిత్య సేవలకు గుర్తింపుగా తమను పుచ్చలపల్లి సుందరయ్య స్మారక అవార్డుకు ఎంపిక చేసినట్లు బ్రహ్మానందరావు తమకు పంపిన ఆహ్వాన సందేశంలో పేర్కొన్నట్లు డాక్టర్ శ్రీనివాస్ తెలిపారు.

అధికారుల తీరును నిరసిస్తూ..

మండల పరిషత్ సమావేశం బహిష్కరణ

ప్రజాశక్తి-పర్చూరు

పర్చూరు మండల పరిషత్ సమావేశాన్ని బహిష్కరించి నిరసన తెలుపుతున్న సభ్యులు

అధికారుల తీరును నిరసిస్తూ మండల సర్వసభ్య సమావేశాన్ని ప్రజాప్రతినిధులు బహిష్కరించారు. అధికార, ప్రతిపక్ష పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులందరూ ఒకే తాటిపై నిలిచి సమావేశం నుంచి బయటకు వచ్చారు. పర్చూరు మండల సర్వసభ్య సమావేశం శనివారం ఎంపిపి మేకా ఆనందకుమారి అధ్యక్షతన జరిగింది. వివిధ శాఖలకు సంబంధించి ఉద్యోగి వివరిస్తున్న సందర్భంలో కొందరు సభ్యులు వివిధ శాఖల అధికారులు సమావేశానికి ఎందుకు రావటం లేదని ప్రశ్నించారు. అధికారులు లేకుండా మొక్కుబడి సమావేశాలు ఎందుకని నిలదీశారు. మండలంలో ప్రజాప్రతినిధులకు గౌరవం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామాలకు వెళ్లేటప్పుడు కనీస సమాచారం స్థానిక ప్రజాప్రతినిధులకు ఇవ్వటం లేదని అన్నారు. పిఎంఎవై ఇళ్లు మంజూరు చేసినా లబ్ధిదారులకు నివాస ధ్రువీకరణ పత్రాలు 3 నెలలకు పైగా రెవెన్యూ కార్యాలయంలో పరిష్కారం కాకుండా ఉన్న విషయాన్ని సభ దృష్టికి తీసుకువచ్చారు. సభకు తహశీల్దారు రాకపోవటం పట్ల తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. నిధులు ఉన్నా, పనులు చేయలేని పరిస్థితి నెలకొందని సభ్యులు నినదించారు. మండలంలో ఏఇఇ లేకపోవటంపై జడ్పీ సమావేశంలో వినతిపత్రం అందజేసినా స్పందన లేకపోవటం దారుణమన్నారు. ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకువెళ్లినట్లు ఎంపిడిఓ లక్ష్మీదేవి తెలిపారు. పనులు ఏమీ జరగనప్పుడు సమావేశాలు ఎందుకని సభను బహిష్కరించి బయటకు వచ్చినట్లు ఎంపిపి ఆనందకుమారి, జడ్పీటిసి కొల్లా గంగాభవాని, ఎంపిటిసి సభ్యులు, సర్పంచ్‌లు చెప్పారు.

సమగ్ర భూసర్వేపై అవగాహన పెంచుకోవాలి

జాయింట్ కలెక్టర్ కె శ్రీనివాసులు

ప్రజాశక్తి-రేపల్లె

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన జగనన్న శాశ్వత భూ హక్కు మరియు భూ రక్ష పథకంతో భూ సమస్యలు పూర్తిగా పరిష్కారమవుతాయని, దీంతో ప్రతి ఒక్కరికీ మేలు జరగనుందని జిల్లా జాయింట్ కలెక్టర్, కె శ్రీనివాసులు అన్నారు. స్థానిక సీతారామ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన డివిజనల్ లెవెల్ రీసర్వే వర్క్‌షాప్ కార్యక్రమంలో ఆయన పాల్గొని త్వరలో డివిజన్‌లో చేపట్టనున్న రీసర్వేపై ముందస్తు సూచనలు, మార్గదర్శకాలను ఇచ్చి సిబ్బంది అందరూ అందుకు అనుగుణంగా రికార్డుతో సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. భూ వివాదాలను పరిష్కరించడం అన్నది సమగ్ర సర్వే ప్రధాన లక్ష్యాల్లో ఒకటని పేర్కొన్నారు. సమగ్ర సర్వేను నిర్దేశించుకున్న సమయంలోగా పూర్తి చేయడానికి అవసరమైన అన్ని చర్యలూ అధికారులు తీసుకోవాలని కోరారు. అవసరమైన సిబ్బందిని సమకూర్చుకోవాలని, సాంకేతిక పరికరాలను అవసరాలకు అనుగుణంగా తెప్పించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఆదేశించారు. డ్రోన్లు, ఓఆర్ఐ పరికరాలు, రోవర్లు, సర్వే రాళ్లు సమకూర్చుకోవడం... ఇలా ప్రతి అంశంలోనూ వేగం ఉండాలని అన్నారు. సర్వే కార్యక్రమాన్ని అధికారులు ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలి,100 ఏళ్ల తర్వాత సర్వే జరుగుతోందని, ఈ సర్వేను పూర్తిచేయడం ద్వారా ప్రజలకు, రాష్ట్రానికి మేలు జరుగుతుంది. రెవెన్యూ డివిజనల్ అధికారి, రేపల్లె వారు మాట్లాడుతూ రీసర్వే కార్యక్రమంలో భూ కొలతలు అత్యంత అధునాతన పద్ధతిలో జరగనున్నాయని, దీనితో ఎప్పటినుంచో ఉన్న పలు సమస్యలకు పరిష్కారాలు దొరకనున్నాయని తెలిపారు. రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా జెసి శ్రీనివాసులు, ఆర్‌డిఒ పార్థసారథి అంబేద్కర్ విగ్రహానికి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్లు, డిప్యూటీ తహశీల్దార్లు, మండల సర్వేయర్లు, మండల రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు, గ్రామ రెవెన్యూ అధికారులు, గ్రామ సర్వేయర్లు తదితర అధికారులు పాల్గొన్నారు.

అంబేద్కర్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న జెసి, ఆర్‌డిఒ

ప్రమాదకరం.. ఆ రోడ్డు ప్రయాణం..

ప్రాణాలు పోతేగానీ అధికారులు పట్టించుకోరా? ● ఆర్అండ్‌బి అధికారుల నిర్లక్ష్యం ● ప్రమాద ఘటనలు అనేకం

ప్రజాశక్తి-చీరాల

ఆ రోడ్డులో ప్రయాణమంటే మృత్యువుతో పోరాటమే.. బాటసారులు వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా పది అడుగుల మేర భూమిలోకి వెళ్లాల్సిందే.. తరచూ అనేక ప్రమాదాలు జరుగుతున్నా అటు పాలకులు, ఇటు ప్రభుత్వ అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవు. వివరాల్లోకి వెళితే.. చీరాల స్వర్ణ వెళ్లే ఆర్అండ్‌బి రహదారిలో ఉన్న కల్వర్టు వద్ద సుమారు పది అడుగుల మేర గొయ్యిపడింది. నిత్యం ఆ దారిలో ఇంకొల్లు, స్వర్ణ, దగ్గుబాడు పలు ప్రాంత ప్రజలు చీరాలకు రాకపోకలు సాగిస్తుంటారు. రోడ్డుకు మధ్యలో గుంత పడి నాలుగు నెలలు దాటుతున్నప్పటికీ ఆర్అండ్‌బి అధికారులు ఏమాత్రం ఆ వైపు దృష్టి సారించడంలేదు. దీంతో వాహనాదారులు అనేక అవస్థలు పడుతూ ప్రయాణిస్తున్నారు. రాత్రి వేళలో వాహనదారులు ఏమాత్రం ఆదమరిచినా ప్రాణాలు కోల్పోవాల్సిందే. ఇక మూగజీవాల పరిస్థితి చెప్పనక్కరలేదు. నిత్యం పశువుల కాపరులు ఆ మార్గంలో పశువులను తోలుతూ పొలాల్లో మేపుతుంటారు. ప్రధాన రహదారి మార్గమధ్యంలో అతిపెద్ద గొయ్యి ఏర్పడటంతో దీనిపై నిత్యం రాకపోకలు సాగించే ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ప్రభుత్వ అధికారులు ఇప్పటికైనా తమ సమస్యను పరిష్కరించాలని వాహనదారులు కోరుతున్నారు. అయితే ప్రజల అవస్థలను అటు పాలకులు కానీ, ఇటు ప్రభుత్వ ఆర్అండ్‌బి అధికారులు కానీ సమస్యను గుర్తించి పరిష్కరిస్తారా లేకపోతే అంతా తెలిసినా తమకేమీ పట్టనట్లుగా కాలం వెళ్లదీస్తారా అనేది వేచి చూడాల్సిందే.

చీరాల స్వర్ణ రహదారిలో రోడ్డు మధ్యలో ఏర్పడిన గొయ్యి

ప్రజాశక్తి
5
ఆదివారం 27 నవంబర్ 2022

నిస్వార్థ ప్రజానాయకుడు ముప్పరాజు శేషయ్య

సిపిఎం సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య

ప్రజాశక్తి-కొండపి

శేషయ్య స్థూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

కష్టజీవుల విముక్తి కోసం పరితపించిన నిస్వార్థ ప్రజా నాయకుడు ముప్పరాజు శేషయ్య అని సిపిఎం సీనియర్ నాయకులు ముప్పరాజు కోటయ్య తెలిపారు. పెరిదేపిలోని ఎంఎస్ విజ్ఞాన కేంద్రంలో శనివారం నాడు ముప్పరాజు శేషయ్య వర్ధంతి సందర్భంగా అనేక కార్యక్రమాలు నిర్వహిం చారు. ముందుగా పెరిదేపిలోని స్థూపం వద్ద శేషయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కోటయ్య మాట్లాడుతూ ముప్పరాజు శేషయ్య మరణించి 22 ఏళ్లు గడిచినా.. పేదల హృదయాల్లో ఆయన స్థానం పదిలంగా ఉందని ఆయన అన్నారు. ఒక వ్యక్తి మరణిస్తే ఆ రోజున ఆ గ్రామమంతా తిండి తినకుండా మానుకున్నారంటే ఆయన ఆ జనం కోసం ఎంత నిస్వార్థంగా పనిచేశాడో అర్థమవుత ున్నదని అన్నారు. పుచ్చలపల్లి సుందరయ్య స్ఫూర్తితో రాజకీయ జీవితాన్ని ప్రారంభించిన శేషయ్య విద్యార్థిగా ఉన్నప్పుడే బాల సంఘాన్ని స్థాపించి శాస్త్రీయ దృక్పథం కలిగించే కృషి చేశారని తెలిపారు. సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు ఆండ్రా మాల్యాద్రి మాట్లాడుతూ శేషయ్య స్ఫూర్తితో పెరిదేపి గ్రామం నుంచి కార్యకర్తలుగా వచ్చి ఆరు మంది సిపిఎం నాయకులుగా ఎదిగి రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో పనిచేస్తున్నారని తెలిపారు. ఆయన వారసత్వాన్ని కొనసాగిస్తామని, ఆశయాల సాధనకు అంకితమవుతామని ఆయన తెలియచేశారు. సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కంకణాల ఆంజనేయులు మాట్లాడుతూ త్యాగమూర్తుల జీవితాలను చరిత్ర ఎన్నడూ మరువదని అన్నారు. శేషయ్య అందించిన స్ఫూర్తిని కొనసాగిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మండల కార్యదర్శి కెజి మస్తాన్, నాయకులు గుమ్మళ్ల వెంకటేశ్వర్లు, శేషయ్య భార్య లక్షుమమ్మ, మల్లెల కొండయ్య, అంగలకుర్తి బ్రహ్మయ్య, పెద్ద పేతురు, ముప్పారాజు బ్రహ్మయ్య, జి.వందనం తదితరులు పాల్గొన్నారు.

అక్రమ అరెస్టులకు పాల్పడితే సహించేది లేదు

ఎస్టీ కమిషన్ మెంబర్ శంకర్‌నాయక్

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

చేతిలో చట్టం ఉందని అక్రమంగా అరెస్టులు చేస్తే సహించేది లేదని ఎస్‌టి కమిషన్ సభ్యుడు సోమశంకర్ నాయక్ అన్నారు. ఇటీవల చెంచు గిరిజనులు ఎలుగు బంటి కేసు విచారణలో పరార్ అయిన విషయంలో చెంచు గిరిజనులు గత నాలుగు రోజులుగా అటవీశాఖ కార్యాలయం ఎదుట తిష్ట వేశారు. దీంతో సమస్య తీవ్రతరమైంది. దీంతో సమస్య ఎస్టీ కమిషన్ దృష్టికి వెళ్ళడంతో ఎస్టీ కమిషన్ మెంబర్ సోమశంకర్‌నాయక్ స్థానిక అటవీ శాఖ కార్యాలయానికి చేరుకొని కమిషన్‌పై చర్చించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెంచులకు అవగాహన కల్పించాల్సిన బాధ్యత అటవీశాఖ అధికారుల దేనన్నారు. ఎలాంటి తప్పు లేకుండా చర్యలు తీసుకుంటే వారిపై ఎస్టీ కమిషన్ ద్వారా రీ ఎంక్వైరీ చేయడం జరుగుతుందన్నారు. అనంతరం ఫారెస్టు రేంజర్ విశ్వేశ్వరరావు మాట్లాడుతూ ప్రతి చెంచుగూడెం మినరల్ వాటర్ ప్లాంట్‌లను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. పరారైన నలుగురు ముద్దాయిలు మధ్యవర్తుల సమక్షంలో కోర్టులో లొంగి పోయినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ శ్రీనివాసరావు, ఫారెస్టు రేంజర్లు విశ్వేశ్వరరావు, ప్రసన్నజ్యోతి, సుబ్బారావు, పలు గూడెంల చెంచుపెద్దలు, మహిళలు, అటవీ శాఖ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఎస్‌టిపి ద్వారా మురుగు నీరు శుద్ధి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

పరిశీలిస్తున్న కమిషనర్

సీవేజి ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టిపి) ద్వారా ఒంగోలు నగరంలోని పోతురాజు కాలువ ద్వారా పారే మురుగునీటిని శుద్ధి చేయడం జరుగుతోందని, అందుకు అవసరమైన ప్లాంటు నిర్మాణ పనులు తుదిదశలో ఉన్నాయని ఒంగోలు నగపాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు తెలిపారు. నగర పరిధిలోని గుత్తికొండ వారిపాలెం వద్ద పోతురాజు కాలువపై నిర్మిస్తున్న ఎస్‌టిపి నిర్మాణ పనులను శనివారం ఆయన పరిశీలించారు. ప్లాంట్ వర్కు ఆపరేషన్ గురించి అక్కడ సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఈసందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ప్లాంటు వినియోగంలోకి వస్తే ఒంగోలు నగరం నుంచి పోతురాజు కాలువ ద్వారా సముద్రంలోకి వెళ్లే మురుగు నీటిని గుత్తికొండవారి పాలెం వద్ద శుద్ధి చేయడం జరుగుతోందన్నారు. శుద్ధిచేసిన నీటిని సమీప గ్రామాల రైతుల పొలాలకు పంటలు పండించుకునేందుకు ఇవ్వడం జరుగుతోందన్నారు. నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనలు అమల్లో భాగంగా సుమారు రూ. 33కోట్ల వ్యయంతో ఎస్‌టిపి నిర్మాణం చేపట్టడం జరిగిందన్నారు. వచ్చే మాసంలో ఈప్లాంటును వినియోగంలోకి తీసుకు వస్తామని వివరించారు. రోజుకు 15 మిలియన్ లీటర్ల మురుగునీటిని శుద్ధిచేయడం ప్లాంటు లక్ష్యమని పేర్కొన్నారు. కమిషనర్ వెంట ఒంగోలు కార్పొరేషన్ ఇంజినీర్ కె మాల్యాద్రి, ప్రజారోగ్యశాఖ ఎగ్జికూటివ్ ఇంజినీర్ రహంత్‌జానీ, డిఈఈ గణపతి, తదితరులు ఉన్నారు.

వీధివ్యాపారులపై వేధింపులు ఆపాలి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

మాట్లాడుతున్న గౌరవాధ్యక్షులు రమేష్

నగరంలోని వీధి వ్యాపారులపై ఆశీలు కాంట్రాక్టర్లు, పోలీసుల వేదింపులు ఆపాలని ఒం గోలు నగర స్ట్రీట్ వెండర్స్ యూనియన్ (సిఐటియు) మహాసభ తీర్మానించింది. యూని యన్ నగర మహాసభ శనివారం సుందరయ్య భవన్‌లోని సూరా పాపిరెడ్డి, సీతారా మమ్మ మీటింగ్ హాలులో జరిగింది. మహాసభలో వీధి వ్యాపారుల గుర్తింపు కార్డులు రెన్యువల్ చేయాలని, కొత్త కార్డులు ఇవ్వాలని తీర్మానించారు. మహాసభ నుద్దేశించి యూనియన్ గౌరవ అధ్యక్షులు జి రమేష్ మాట్లాడారు. వీధి వ్యాపారుల నుంచి ఆశీలు కాంట్రాక్టర్లు బెదిరించి డబ్బులు వసూలు చేస్తు న్నారని, పోలీసులు ఇష్టారీతిన చలా నాలు వేస్తున్నారని ఆరోపించారు. వీధి వ్యాపారుల రక్షణ చట్టాన్ని అమలు చేయాలని, వారిపై వేదింపులు ఆపాలని కోరారు. సమస్యల పరిష్కారానికి వీధి వ్యాపారులంతా ఐక్యంగా పోరాడాలని పిలుపునిచ్చారు.

నూతన కమిటి ఎన్నిక....

మహాసభ సందర్భంగా నూతన కమిటిని ఎన్నుకున్నారు. నగర అధ్యక్ష, కార్యదర్శులుగా బొల్లిపల్లి రమేష్, మేకల లక్ష్మీనారాయణ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా ధర్నా కోటేశ్వరరావు, గుదె సుబ్బారావు, ఎస్‌కె కాలేషా, సహాయ కార్యదర్శిగా మురళీ కృష్ణ, కమిటి సభ్యులుగా దొడ్డ గంగయ్య, అంగిరేకుల మూర్తమ్మ, కె చెన్నకేశవ రావు, అబ్బూరి శ్రీనివాసులు, కర్లపూడి కోటేశ్వరరావు, ఎన్నికయ్యారు.

కంకర అక్రమ తవ్వకాలపై నిరసన

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

వినతిపత్రం అందజేస్తున్న గాలి వెంకటరామిరెడ్డి

పూలసుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ పరిధిలోని ముంపు గ్రామమైన పెద్దారవీడు మండలం కలనూతల గ్రామం వద్ద బూస్టర్ కాలువ సమీపంలో కంకర మిషన్‌ను ఏర్పాటు చేసి కాలువలోని కంకరను అక్రమంగా తొవ్వుకుంటూ.. సొమ్ము చేసుకుంటున్న వారిపై వెంటనే క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరుతూ నిర్వాసితుల సంఘం కన్వీనర్ గాలి వెంకటరామిరెడ్డి ఆధ్వర్యంలో ముంపు గ్రామాలకు చెందిన నిర్వాసితులు శనివారం స్థానిక మైనింగ్ ఏడిఏ కార్యాలయం ఎదుట నిరసన ప్రదర్శన చేపట్టారు. అనంతరం సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని మైనింగ్ కార్యాలయ అధికారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో గొట్టిపడియ ముంపు గ్రామాల నిర్వాసితులు వేల్పుల చెన్నారెడ్డి, బుర్రి వెంకటేశ్వర్లు, ఆర్.శ్రీనివాసులు, ఎన్. శ్రీనివాసులు, ఆరవీటి రమేష్, రైతు నాయకులు డేవిడ్ పాల్గొన్నారు.

డిపిఒ పరిశీలన

ప్రజాశక్తి-పామూరు

స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని డిపిఒ జివి నారాయణరెడ్డి సాధారణ తనిఖీలో భాగంగా శనివారం పరిశీలించారు. ఈసందర్భంగా పంచాయతీలో ఉన్న సమస్యల గురించి అడిగి తెలుసుకున్నారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని ఆయన హామీ ఇచ్చారు. అనంతరం ఉపసర్పంచి వెంకటసాయి కిరణ్ డిపిఒను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ జూనియర్ అసిస్టెంట్ జి. రత్నకుమార్, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-మార్కాపురం రూరల్

డిసెంబర్ 8,9,10 తేదీలలో ఏలూరు జిల్లా జంగారెడ్డిగూడెంలో జరగనున్న వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలని సంఘ అధ్యక్షుడు తురక ఎడుకొండలు కోరారు. మండల పరిధిలోని పెద్దనాగులరం గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం జెండాను శనివారం ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన జిల్లా నాయకులు గుమ్మ బాలనాగయ్య మాట్లాడారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా కమిటీ సభ్యులు రేపని తిరుపతయ్య, ఓర్సు అడివయ్యా, గురుస్వామి తదితరులు పాల్గొన్నారు.

శనగపంటపై పొలంబడి

ప్రజాశక్తి-గిద్దలూరు రూరల్

స్థానిక రైతు భరోసా కేంద్రంలో శనగపంటపై వైఎస్‌ఆర్ పొలంబడి కార్యక్రమం శనివారం నిర్వహించారు. కార్యక్రమాన్ని ఉద్దేశించి తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం పొందడం, సహజ సిద్ధ వనరులతో సాగు, భూసార పరీక్షను బట్టి ఎరువులు వాడుట, సేంద్రియ మరియు వానపాములు ఎరువుల వాడకం మొదలైన ముఖ్య సూత్రాలను రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి వై.విజయభాస్కర్‌రెడ్డి, వ్యవసాయ విస్తరణ అధికారి శ్రీనివాస్‌రెడ్డి, గ్రామ వ్యవసాయ నాయకులు బాలకేసి, రైతు సోదరులు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సయ్యద్ హనీఫ్

లేబర్‌కోడ్స్‌ను ఉపసంహరించాలి

ప్రజాశక్తి-పామూరు

కేంద్రప్రభుత్వం అవలంభిస్తున్న లేబర్ కోడ్స్‌ను ఉపసంహరించాలని సిఐటియు జిల్లా నాయకులు సయ్యద్ హనీఫ్ అన్నారు. శనివారం పామూరులో సుందరయ్య భవన్‌లో లేబర్ కోడ్స్ కార్మికులపై ప్రభావం అంశం స్టడీ సర్కిల్ జరిగింది. ఈకార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈ చట్టాల కారణంగా కార్మికులు యాజమాన్యానికి బానిసలుగా మారే అవకాశం ఉందని ఆయన తెలిపారు. కార్మికులు ఈ లేబర్ కోడ్స్‌ను వ్యతిరేకించాలని ఆయన కోరారు. ఈ స్టడీ సర్కిల్ సమావేశంలో అల్లాబక్షు, మహదేవ, శ్రీను, శంకర్, కే మాల్యాద్రి, ధనలక్ష్మి, ఖాదరున్నీసా పాల్గొన్నారు.

దుప్పట్లు పంపిణీ

ప్రజాశక్తి-కొండపి

ముప్పరాజు శేషయ్య వర్ధంతి సందర్భంగా ముప్పరాజు విజ్ఞాన కేంద్రంలో 60 మంది వృద్ధులకు శనివారం దుప్పట్లు పంపిణీ చేయడం జరిగిందని భగత్ సింగ్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ మల్లెల రమేష్ తెలిపారు. ఈ సభలో మల్లెల రమేష్ మాట్లాడుతూ ముప్పరాజ శేషయ్య అందించిన స్ఫూర్తితో పెరిదేఎ నుంచి ఇతర ప్రాంతాలకు వెళ్లిన వారితో అసోసియేషన్ ఏర్పాటు చేసి ప్రజా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగలకుర్తి సురేష్, లక్కెపోగు లక్ష్మయ్య పాల్గొన్నారు.

ధర్నాను జయప్రదం చేయండి

ప్రజాశక్తి-పొదిలి

జిల్లాలో స్వచ్ఛ భారత్ కార్మికుల జీతాల బకాయిలు వెంటనే చెల్లించాలని కోరుతూ నవంబర్ 30న ఎంపిడిఒ ఆఫీసు వద్ద జరుగు ధర్నాను జయప్రదం చేయాలని సిఐటియు ప్రకాశం జిల్లా అధ్యక్షుడు యం.రమేష్ పిలుపునిచ్చారు. శనివారం పొదిలిలో టి.ఇశ్రాయెల్ అధ్యక్షతన జరిగిన స్వచ్ఛ భారత్ కార్మికుల జిల్లా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సమావేశంలో రమేష్ మాట్లాడుతూ స్వచ్ఛ భారత్ కార్మికులకు 6 నెలల నుండి 27 నెలలు జీతాలు బకాయిలు ఉంటే ఎలా బ్రతకాలని అన్నారు.జీతాల బకాయిలపై నవంబర్ 30న మండలాల్లో ధర్నాలు చేయనున్నట్లు తెలిపారు. అప్పటికీ జీతాలు చెల్లించకుంటే విధులు బహిష్కరించాల్సి వస్తుందని హెచ్చరించారు.

'జంకె'ను కలిసిన సర్పంచులు

ప్రజాశక్తి-పొదిలి

వైసిపి ప్రకాశం జిల్లా అధ్యక్షుడిగా నియమితులైన మార్కాపురం మాజీఎమ్మెల్యే జంకె వెంకటరెడ్డిని పొదిలి మండల సర్పంచులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. శనివారం జంకెను ఆయన స్వగృహంలో కలిసి పూలమాలలతో ఘనంగా సత్కరించారు. జంకెను కలిసిన వారిలో మాజీ ఎంపిపి కోవెలకుంట్ల నరసింహారావు ఆధ్వర్యంలో పొదిలి మండల సర్పంచులు శనగల సుధాకర్ రెడ్డి, రెడ్డి బోయిన వెంకటేశ్వర్లు, చిరుపల్లి శ్రీనివాసులు, జేమ్స్, సాంసన్, షేక్ గౌస్ బాషా, రోశి రెడ్డి ఉన్నారు.

మాస్టర్ ప్లాన్ సరిచేయాలి

ప్రజాశక్తి - ఒంగోలు సబర్బన్

ఒంగోలు నగరంలో నూతనంగా ప్రతిపాదించిన జిఐఎస్ ప్రతిపాదిత మాస్టర్‌ప్లాన్‌లో చోటుచేసుకున్న తప్పిదాలను సరిచేయాలని 19వ డివిజన్ వైసిపి కార్పొరేటర్ ఈదర వెంకట సురేష్ బాబు(చిన్నారి) కార్పొరేషన్ అధికారులను కోరారు. మాస్టర్‌ప్లాన్‌లో సవరణలు, సూచనలు చేస్తూ శనివారం ఆయన కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. ఇంకా కొన్ని రోడ్లు విస్తరణ, కొన్ని రోడ్లు కుదింపునకు సంబంధించి ఆయన పలు సూచనలు కమిషనర్‌కు లిఖిత పూర్వకంగా అందజేశారు.

మధ్యాహ్న భోజన పథకం తనిఖీ

ప్రజాశక్తి-పిసి.పల్లి

ప్రభుత్వం నిర్వహిస్తున్న మధ్యాహ్న భోజన పథకాన్ని స్థానిక ఇన్‌చార్జి ఎంఇఓ జె.ప్రసాదరావు శనివారం తనిఖీ చేశారు. మండలంలోని మెట్లవారిపాలెం, మూలెవారిపల్లి, కోదండరామాపురం, శంకరాపురం పాఠశాలల్లో తనిఖీ చేసి మధ్యాహ్న భోజన పథకం పరిశీలించారు. పాఠశాల రికార్డులను, విద్యార్థుల హాజరును పరిశీలించారు. విద్యార్థులను పలు ప్రశ్నలు అడిగి సమాధానాలను రాబట్టారు.

వైసిపి ఆగడాలపై ప్రశ్నించాలి

- రాష్ట్రానికి ఇదేం ఖర్మ పోస్టర్లు ఆవిష్కరణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

వైసిపి నాయకుల ఆగడాలను ప్రజలు ప్రశ్నించాలని పలువురు టిడిపి నాయకులు పిలుపునిచ్చారు. టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధనరావు సూచన మేరకు రాష్ట్రానికి ఇదేం ఖర్మ పోస్టర్ ఆవిష్కరణ శనివారం జరిగింది. తొలుత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా టిడిపి కార్యాలయంలో అంబేద్కర్ చిత్రపటానికి నివాళులర్పించారు. ఎన్టీఆర్ భవన్‌లో జరిగిన కార్యక్రమంలో ముఖ్య నాయకులు మాట్లాడారు. సమావేశం లో మాజీ మున్సిపల్ చైర్మన్ మంత్రి శ్రీనివాసరావు, నగర పార్టీ అధ్యక్షుడు కొఠారి నాగేశ్వరరావు, బండారు మదన్, పోలవరపు వెంకట రామయ్య, గుర్రాల రాజ్ విమల్, షేక్ కపిల్ బాషా, నల్లమోతు బాల గంగాధర్, రామచంద్ర గౌడ్, నావూరి కుమార్, నూతల పాటి పవన్, కోటపూరి చిరంజీవి పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలి

ప్రజాశక్తి - మద్దిపాడు

18సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఓటు హక్కు కలిగి ఉండాలని రాష్ట్ర ఓటు నమోదు పరిశీలకుడు సత్యనారాయణ పేర్కొన్నారు. శనివారం మండల పరిధి లోని వెల్లంపల్లి గ్రామ సచివాలయంలో ఓటు నమోదు కార్యక్రమం నిర్వహించారు. ఓటు నమోదు, అలాగే నమోదులో జరిగే పొరపాట్లు సరిచేసే విధానం గురించి అధికారులు అవగాహన కల్పించారు. వీరి వెంట తహశీల్దార్ జె. లక్ష్మి నారాయణ, ఆర్ఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ శ్రీరామ్, గ్రామ రెవిన్యూఅధికారి శ్రీనివాసరావు అరుణ సిబ్బంది పాల్గొన్నారు

బీసీల ఐక్యతతోనే రాజ్యాధికారం

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

యర్రగొండపాలెం పట్టణంలోని ఆర్అండ్‌బి అతిథి గృహం వద్ద బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో శనివారం సమావేశం నిర్వహించారు. సమావేశంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేశన శంకరరావు పాల్గొని మాట్లాడుతూ బహుజన సామాజిక వర్గాలకు స్పష్టమైన ఇడబ్ల్యూఎస్ రిజర్వేషన్ల పైన సుప్రీంకోర్టు తీర్పును మరలా సమీక్షించాలని డిమాండ్ చేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జనగణన చేయకుండా అడ్డుకుంటున్నాయని తెలిపారు. త్వరలో రాష్ట్రంలో బీసీ యునైటెడ్ ఫ్రంట్ అనే పార్టీను ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో యువజన సంఘం నాయకులు క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

అధికారుల సూచనలు తప్పక పాటించాలి : ఎఒ

ప్రజాశక్తి-కొనకనమిట్ల

పంటల సంరక్షణ కోసం అధికారుల సూచనలు తప్పక పాటించాలని మండల వ్యవసాయశాఖ అధికారి కె.ప్రసన్నరంగలక్ష్మీ శనివారం తెలిపారు. మండలంలోని కొనకనమిట్ల గ్రామంలో వ్యవసాయ సహాయకులకు పొలంబడి కార్యక్రమంపై శిక్షణ ఇచ్చారు. కంది పంట మొగ్గ, పూత దశలో ఉన్నప్పుడు మరక మచ్చల పురుగు ఆశిస్తుందని, దీని నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి, నివారణ గురించి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయశాఖ అధికారులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా రాజ్యాంగ దినోత్సవం

అంబేద్కర్ కు నివాళులర్పిస్తున్న ఎస్‌పి , అధికారులు

ప్రజాశక్తి-ఒంగోలు క్రైం

స్థానిక ఎస్‌పి కార్యాలయంలో రాజ్యాంగ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఏఎస్‌పి కె.నాగేశ్వర రావు(అడ్మిన్) డా. బి.ఆర్.అంబేద్కర్ విగ్రహనికి పూలమాలల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎఆర్ ఎఎస్‌పి అశోక్‌బాబు, ఎస్‌బి డిఎస్‌పి బి.మరియదాసు, ట్రాఫిక్ డిఎస్‌పి వి.శ్రీనివాసరావు, డిసిఆర్‌బి సిఐ పి.దేవప్రభాకర్, డిపిఓ ఎఒ ఎం.సులోచన, సిబ్బంది పాల్గొన్నారు. **పెద్దారవీడు :** రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా వైసిపి మండల కన్వీనర్ పాలిరెడ్డి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో డాక్టర్ ఆంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నివాళు లర్పించినవారిలో వైస్‌ఎంపిపి గుం డారెడ్డి, వెంకటేశ్వర్లురెడ్డి, తదిరులున్నారు. **యర్రగొండపాలెం :** రాజకీయాలకతీతంగా రాజ్యాంగాన్ని పరిరక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని యర్రగొండపాలెం మాజీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఒంగోలు మూర్తిరెడ్డి తెలిపారు. శనివారం స్థానికంగా గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి దొంతా కిరణ్, జడ్‌పిటిసి చేదూరి విజయభాస్కర్, సర్పంచి రామావత్ అరుణాబాయి, ఎన్ఆర్ఇజీఎస్ స్టేట్ కౌన్సిల్ మెండర్ అడిపి కరుణాకర్ పాల్గొన్నారు. **మార్కాపురం :** శనివారం స్థానిక జవహర్‌నగర్‌లోని జంకె వెంకటరెడ్డి నివాస గృహంలో రాజ్యాంగ దినోత్సవ వేడుకలు శనివారం నిర్వహించారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాణ డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాల వేసి స్మరించుకున్నారు. కార్యక్రమంలో పెద్దారవీడు మండల వైసిపి కన్వీనర్ పాలిరెడ్డి క్రిష్ణారెడ్డి, వైసిపి నాయకులు గుండారెడ్డి వెంకటేశ్వరరెడ్డి, అక్కిరెడ్డి, రామక్రిష్ణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు. **సిఎస్.పురం:** భారతదేశానికి రాజ్యాంగ దినోత్సవము సందర్భంగా స్థానిక పోలీస్‌స్టేషన్‌ఆవరణలో అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అనతరం ఎస్ఐ పి.అనిల్‌కుమార్‌ను ఘనంగా సన్మానిం చారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పాల్గొన్నారు. **సంతనూతలపాడురూరల్ :** స్థానిక మండల తెలుగుదేశం పార్టీ కార్యాలయం నందు శనివారం రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా ఆ పార్టీ కార్యకర్తలతో 'రాష్ట్రానికి ఇదేం ఖర్మ' కార్యక్రమం టిడిపి మండల పార్టీ అధ్యక్షుడు మద్దినేని హరిబాబు అధ్యక్షతన జరిగినది. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షుడు మద్దినేని హరిబాబు, బాపట్ల పార్లమెంట్ టిఎన్‌టియుసీ ఆర్గనైజింగ్ సెక్రటరీ పావులూరి నారాయణస్వామి చౌదరి, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి తాటితోటి నరసింహారావు, ఎస్ ఎన్ పాడు టి ఎన్ టి యు సి అధ్యక్షుడు ప్రధాన కార్యదర్శి మాదాల శ్రీనివాసరావు, పాల్గొన్నారు. **ఒంగోలు సబర్బన్ :** శనివారం రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా కార్పొరేషన్ కార్యాలయంలో సిబ్బంది చేత ఒంగోలు నగరపాలక సంస్థ కమిషనర్ ఎం వెంకటేశ్వరరావు ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో అసిస్టెంట్ కమిషనర్ పి వీరాంజనేయులు, మేనేజర్ పి శ్రీహరి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. **ముండ్లమూరు :** డాక్టర్ బిఆర్ అంబేద్కర్ మహోన్నత వ్యక్తి అని మండల సిపిఎం పార్టీ మండల కార్యదర్శి యల్లంపల్లి ఆంజనేయులు అన్నారు. అంబేద్కర్ కాలనీ వద్ద ఉన్న బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు బోడపాటి హనుమంతరావు, డిబిఆర్‌సి మండల కోఆర్డినేటర్ జి వెంకట్రావు, దళిత నాయకులు డగ్లస్, ఫిలిప్‌రాజు పాల్గొన్నారు. **పామూరు :** రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా పామూరులోని ప్రభుత్వ జూనియర్ కళాశాల నందు జన విజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో రాజ్యాంగ పీఠిక కరపత్రాన్ని ఆవిష్కరించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఐద్వా జిల్లా అధ్యక్షులు షమ్మీ పాల్గొని సమాజంలో రోజురోజుకు మహిళల పట్ల విద్యార్థుల పట్ల జరుగుతున్న అత్యాచారాల గురించి తెలియజేశారు. **శింగరాయకొండ :** మండలంలో శనివారం భారత రాజ్యాంగ దినోత్సవం సందర్భంగామ డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. శింగరాయకొండ పోలీస్ స్టేషన్ వద్ద ఉన్న డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి వైసిపి కొండపి ఇన్‌ఛార్జ్ వరికూటి అశోక్ బాబు ఆయన సతీమణి లక్ష్మి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేద్కర్ విగ్రహానికి ఎస్ఐ ఫిరోజా ఫాతిమా పూలమాలలు వేసే నివాళులర్పించారు. **దరిశి :** భారత రాజ్యాంగ దినోత్సవం సంధర్భంగా పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. దరిశి ఎమ్మెల్యే డాక్టరు మద్దిశెట్టి వేణుగోపాల్ క్యాంపు కార్యాలయంలో ఎంపిపి గోళ్లపాటి సుధారాణి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఘనంగా మాగుంట సుబ్బరామరెడ్డి జయంతి



సుబ్బరామిరెడ్డికి నివాళులర్పిస్తున్న నాయకులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు మాజీ పార్లమెంట్ సభ్యులు స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి జయంతి వేడుకలను శనివారం మాగుంట అభిమానులు ఘనంగా నిర్వహించారు. స్థానిక రాంనగర్ 2వ లైన్‌లోని మాగుంట కార్యాలయంలో స్వర్గీయ మాగుంట సుబ్బరామరెడ్డి చిత్ర పటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. నగరంలోని పలు ప్రదేశాలలో గల మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహాలకు పలువురు నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా సుబ్బరామిరెడ్డి మనవడు మాగుంట సుబ్బరామరెడ్డి, ఎన్.లక్ష్మీనారాయణరెడ్డి, ఎఎంసి మాజీ చైర్మన్ అయినాబత్తిన ఘనశ్యాం, వైసిపి నాయకుడు గొర్రెపాటి శ్రీనివాసరావు, డిసిఎంఎస్ మాజీ అధ్యక్షుడు బెల్లం సత్యనారాయణ, ఒంగోలు సూపర్ బజార్ మాజీ చైర్మన్ తాతా ప్రసాద్, జిల్లా పశుగణాభివద్ధి మాజీ అధ్యక్షుడు కుప్పా రంగనాయకులు, మాజీ ఎమ్మెల్యే కసుకుర్తి ఆదెన్న, కార్పొరేటర్ శ్రీరామ నాగభూషణం, కరవది సొసైటీ అధ్యక్షుడు వాకా కష్ణారెడ్డి, మాజీ సర్పంచి కుందం హనుమారెడ్డి, సహకార సంఘ అధ్యక్షుడు వాకా రంగారెడ్డి, పాలపర్తి శ్రీనారెడ్డి, కె.అనీలాకుమారి, యల్లా దేవాక్షమ్మ, లక్ష్మి పాల్గొన్నారు.

సంతనూతలపాడు రూరల్ : దివంగత ఒంగోలు మాజీ ఎంపి మాగుంట సుబ్బరామిరెడ్డి 75వ జయంతి సందర్భంగా స్థానిక ఎంఎస్ఆర్ కళాశాల నందు మరియు బస్టాండ్ సెంటర్‌లో గల మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు . కార్యక్రమంలో ఎంఎస్ఆర్ కళాశాల ప్రిన్సిపల్ డి రమణారెడ్డి, డి ఇంద్రసేనారెడ్డి కళాశాల అధ్యాపక బందం విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

శింగరాయకొండ : మాజీ పార్లమెంటు సభ్యుడు స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి 72వ జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. వైసిపి మైనార్టీ సెల్ నాయకుడు ఎస్.కె సలీం భాషా ఆధ్వర్యంలో శింగరాయకొండ పోలీస్ స్టేషన్ వద్ద ఏర్పాటు చేసిన మాగుంట సుబ్బరామిరెడ్డి విగ్రహం వద్ద వైసిపి కొండపి ఇన్‌ఛార్జ్ వరికూటి అశోక్ బాబు, డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి, శింగరాయకొండ సర్పంచి తాడిపర్తి వనజ సుబ్బరామిరెడ్డి విగ్రహానికి పూలమాలవేసి నివాళు లర్పించారు. మాగుంట సుబ్బరామిరెడ్డి స్థాపించిన శింగరాయకొండ పెరల్ డిస్టలరీ వద్ద ఆయన విగ్రహానికి ఆయన మనవడు మాగుంట సుబ్బరామిరెడ్డి (జూనియర్), కందుకూరు శాసనసభ్యులు మానుగుంట మహీధర్ రెడ్డి, పిడిసిసి బ్యాంక్ చైర్మన్ డాక్టర్ మాదాసి వెంకయ్య ,ఆనం శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా స్వర్గీయ మాగుంట సుబ్బరామిరెడ్డి జన్మదిన వేడుకలు నిర్వహించారు. శింగరాయకొండ లో జరిగిన కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ రాపూరి ప్రభావతి ,మాజీ వైస్ చైర్మన్ షేక్ లియాకత్ , దేవస్థానం చైర్మన్ పామర్తి మాధవరావు , వైస్ ఎంపీపీ సామంతుల రవికుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మహిళల స్వయం సంవృద్ధికి కృషి : ఎమ్మెల్యే

ప్రజాశక్తి-బేస్తవారిపేట

రాష్ట్రంలో మహిళల స్వయం సంవృద్ధికి ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని గిద్దలూరు ఎమ్మెల్యే అన్నా వెంకట రాంబాబు అన్నారు. శనివారం సాయంత్రం మండల కేంద్రంలో ప్రభుత్వ వైద్యశాల వద్ద రూ.16 లక్షల రూపాయలతో నిర్మించిన జగనన్న పాలవెల్లువ మహిళా డైరీని ఆయన లాంఛనంగా ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి వేగినాటి ఓసూర రెడ్డి, జడ్‌పిటిసి వెంకట్ రాజు, బేస్తవారిపేట సర్పంచి బుద్ధుల ఆశ్రితజ్యోతి, ఉప సర్పంచి మట్ట రమేష్ ఎంపిటిసి సభ్యులు వైఎస్ఆర్ సిపి నాయకులు, అధికారులు, మహిళలు పాల్గొన్నారు.

సంఘీభావం తెలుపుతున్న కుంచేపల్లి యువకులు

అనిల్ పాదయాత్రకు సంఘీభావం

ప్రజాశక్తి-పొదిలి

టిఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర కార్యదర్శి, స్థానిక స్నేహ పండు చికెన్ సెంటర్‌ల అధినేత వరికుంట్ల అనిల్ కుమార్ తిరుమల పాదయాత్రకు మండలంలోని కుంచేపల్లి వాసులు సంఘీభావం తెలిపారు. ఈ నెల 21 సోమవారం పొదిలి నుండి తిరుమలకు బయలుదేరిన అనిల్ బృందం శనివారం నెల్లూరు జిల్లా సంగం వద్దకు చేరుకుంది. ఈసందర్భంగా ఆయన స్వగ్రామం అయిన కుంచేపల్లి వాసులు అనిల్‌ను కలిసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అనిల్ మిత్రబృందం పాల్గొన్నారు.

లబ్ధిదారులతోమాట్లాడుతున్న ఎమ్మెల్యే అన్నా

గ్రామస్వరాజ్య స్థాపనే ధ్యేయం

ప్రజాశక్తి-బేస్తవారిపేట

మహాత్మా గాంధీ కలలు గన్న గ్రామ స్వరాజ్య స్థాపనే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను అమలు చేయడం ద్వారా ప్రజల వద్దకే ప్రభుత్వ సేవలు అందిస్తున్నారని ఎమ్మెల్యే అన్నా రాంబాబు అన్నారు. శనివారం మండలంలో 69వ రోజు చెట్టిచర్ల, పాపాయిపల్లి, వైఎస్ఆర్ నగర్ గ్రామాలలో గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా ఎమ్మెల్యేకు గ్రామంలోని వైసిపి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు గజమాలతో స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో జడ్‌పిటిసిలు, ఎంపిపిలు, ఎంపిటిసిలు, సర్పంచులు, వైసిపి నాయకులు, కార్యకర్తలు, అధికారులు,సచివాలయ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

డాక్టర్ అంబేద్కర్‌కు ఘన నివాళి

ఘనంగా రాజ్యాంగ ఆమోద దినోత్సవం

ప్రజాశక్తి -బాపట్ల జిల్లా

భారత రాజ్యాంగాన్ని ఆమోదించి 73 వసంతాలు పూర్తయిన సందర్భంగా రాజ్యాంగ దినోత్సవాన్ని బాపట్ల జిల్లా పోలీసులు ఘనంగా నిర్వహించారు. పోలీస్ అధికారులు రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. బాపట్ల జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు జరిగిన ఈ కార్యక్రమంలో అడిషనల్ ఎస్పీ పి మహేష్, అడ్మిన్ ఆర్ఐ ఎల్ మన్మథ రావు, వెల్ఫేర్ ఆర్ఐ బి శ్రీకాంత్ నాయక్, ఆర్ఎస్ఐలు, డిపిఓ, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

బాపట్ల రూరల్: డాక్టర్ బిఆర్ అంబేద్కర్ రచించిన రాజ్యాంగ స్ఫూర్తితో ముందుకు సాగాలని బాపట్ల శాసన సభ్యులు కోన రఘుపతి అన్నారు. శనివారం బాపట్ల జిల్లా కేంద్రంలోని రైల్వే స్టేషన్ వద్ద రాజ్యాంగ ఆమోద దినోత్సవం సందర్భంగా రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌ను స్మరించుకుంటూ ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా శాసనసభ్యులు కోన రఘుపతి మాట్లాడుతూ ఎంతో దూర దృష్టితో భారత దేశానికి రాజ్యాంగాన్ని రచించి అన్ని వర్గాలకు న్యాయం జరిగేలా చేయడం అంబేద్కర్ గొప్పతనానికి నిదర్శనం అన్నారు. ప్రపంచంలోనే అతి పెద్ద లిఖిత రాజ్యాంగం మనదేనని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ వైసీపీ అధ్యక్షుడు నరాలశెట్టి ప్రకాశరావు, పలు ప్రజా సంఘాల నాయకులు పాల్గొన్నారు.

అద్దంకి: పట్టణంలోని బంగ్లా రోడ్డులోని బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి 73వ రాజ్యాంగ దినోత్సవాన్ని పురస్కరించుకొని బిఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు శనివారం రోటరీ క్లబ్ ఆఫ్ సింగరకొండ, వైసిపి ఇన్‌ఛార్జి బాచిన కృష్ణ చైతన్య, ఈ సందర్భంగా బాచిన కష్ణ చైతన్య, రోటరీ అధ్యక్షులు సందిరెడ్డి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాజ్యాంగంలో చట్టాలు, ప్రభుత్వాలు నడుచుకునే విధానాలు, ఆదేశిక సూత్రాలు, రాజ్యాంగపరమైన విధులు విధానాలు పొందుపరచబడి ఉన్నాయని పేర్కొన్నారు. ప్రభుత్వం శరీరమైతే, రాజ్యాంగం ఆత్మ లాంటిదన్నారు. ప్రభుత్వాలకు దిశా నిర్దేశాలు చూపించేదే రాజ్యాంగమని పేర్కొన్నారు.

మాల మహానాడు ఆధ్వర్యంలో..

అద్దంకి నియోజకవర్గ మాల మహానాడు కమిటీ ఆధ్వర్యంలో శనివారం స్థానిక బంగ్లా రోడ్‌లోని డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద రాజ్యాంగ దినోత్సవ కార్యక్రమం నిర్వహించడం జరిగినది. ఈ సందర్భంగా అద్దంకి నియోజకవర్గ మాల మహానాడు అధ్యక్షుడు అంకం కిరణ్‌కుమార్ మాట్లాడుతూ స్వాతంత్ర భారత అవనిలో జాతిని అత్యంత ప్రభాతం చేసిన వ్యక్తి డాక్టర్ బిఆర్ అంబేద్కర్ అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి బత్తుల రాజశేఖర్, అంకమ్మరావు, వికాస్, ఆంజనేయులు, పూర్ణ, వీరాంజనేయులు, నాగేశ్వరరావు, రమేష్, హనుమంతరావు తదితరులు పాల్గొన్నారు.

పిట్టలవానిపాలెం: 73వ రాజ్యాంగ దినోత్సవం సందర్భంగా భారత రాజ్యాంగ పిత డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ చిత్రపటానికి డిఎల్‌డిఓ సువార్తమ్మ ఘనంగా నివాళి అర్పించారు. మండలంలోని ఖాజీపాలెం గ్రామ పంచాయతీలో రాజ్యాంగ ఆమోద దినోత్సవం శనివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భిన్న మతాలు, భాషలు, భిన్న సంస్కతులు

అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న బాపట్ల ఎమ్మెల్యే కోన రఘుపతి

కలిగి ఉన్న భారత దేశానికి అన్ని వర్గాలకు సమన్యాయం జరిగేలా రాజ్యాంగాన్ని రెండు సంవత్సరాల 11 నెలల 18 రోజులు శ్రమించి తయారు చేసిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. ఇన్‌ఛార్జి ఎంపీడీఓ పద్మజ మాట్లాడుతూ అణగారిన వర్గాలకు చెందిన ప్రజలకు రాజ్యాధికారం దక్కడానికి అంబేద్కర్ దార్శనికత కారణమని కొనియాడారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సుధారాణి, ఏపిఓ సుభాషిణి, నాయకులు దేవందర్ రాజు, ప్రసన్న రాజు, కార్యదర్శి శ్రీనివాసరావు, గ్రామ పెద్దలు భాస్కరరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మేదరమెట్ల: రాజ్యాంగ ఆమోద దినోత్సవ సందర్భంగా మండలంలోని అధికారులు అంబేద్కర్ విగ్రహాలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. మేదరమెట్లలో సర్పంచ్ బొనిగల ఎలిసెమ్మ, ఎంపీడీవో సురేష్‌బాబు, రావినూతలలో సర్పంచ్ చాట్ల విజయ వీణ తదితరులు అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

ఇంకొల్లు రూరల్: ఇంకొల్లు మండలం ఇడుపులపాడు విద్యా పరిషత్ ఉన్నత పాఠశాల మరియు పూసపాడు ఎస్‌కెఏవిఎస్ ఉన్నత పాఠశాలలో భారత రాజ్యాంగ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదట స్థానిక మేజర్ పంచాయతీ సెక్రెటరీ పోపూరి శేషగిరిరావు, ప్రధానోపాధ్యాయుడు పిడపర్తి పేరిరెడ్డి రాజ్యాంగ సభ అధ్యక్షులు డాక్టర్ బాబు రాజేంద్రప్రసాద్ చిత్రపటానికి, రాజ్యాంగ రచనా సంఘం అధ్యక్షుడు డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం పాఠశాల విద్యార్థులచే పాఠశాల సిబ్బందిచే రాజ్యంగ ప్రతిజ్ఞ చేయించారు. గ్రామ పంచాయతీ సెక్రటరీ పోపూరి శేషగిరిరావు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో పూసపాడు ప్రధానోపాధ్యాయుడు కె శ్రీనివాసరావు, కె సాగర్, భవనం శివలీల, బండారు అనిల్ కుమార్, అంబటి సురేష్, వసంత రఘుబాబు, పెండ్యాల రాధిక, గోరంట్ల శ్రీనివాసరావు, గోబిదేశి ఆదినారాయణ, వరికల్లు బ్రహ్మయ్య, గోరంట్ల సంధ్యారాణి, అంబటి, కంభాలపాటి నర్సయ్య తదితరులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు: భారత రాజ్యాంగం దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం భట్టిప్రోలు పంచాయతీ కార్యాలయం వద్దగల అంబేద్కర్ విగ్రహానికి టిడిపి నాయకులు పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ ఎంఎల్‌ఏ ముమ్మనేని వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ దేశంలో అన్ని రాష్ట్రాల అంబేద్కర్ రాజ్యాంగాన్ని అమలు చేస్తుంటే మన రాష్ట్రంలో మాత్రం జగన్మోహనరెడ్డి రాజ్యాంగం నడుస్తోందని అన్నారు. అంబేద్కర్ రాజ్యాంగం అమలు జరిగితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు జయశీలరావు, దీపాల ప్రసాద్, కుక్కల వెంకటేశ్వరరావు, రాయిని ప్రసాద్, బట్టు మల్లికార్జునరావు, సిరాజుద్దీన్ తదితరులు ఉన్నారు.

చెరుకుపల్లి: డాక్టర్ బాబాసాహెబ్ అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని ఆమోదించి నేటికి 73 సంవత్సరాలు అయిన సందర్భంగా సిపిఎం పిట్టలవానిపాలెం మండల కార్యదర్శి కె శరత్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాలవేసి నివాళి అర్పించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది కర్ర ప్రతాప్, దళిత రాజ్యం స్టేట్ సెక్రటరీ బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో..

భారత విద్యార్థి ఫెడరేషన్ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో 73వ రాజ్యాంగ దినోత్సవాన్ని స్థానిక చెరుకుపల్లి గీతం డిగ్రీ కళాశాల, ఎన్నారై జూనియర్ కళాశాలలో కార్యక్రమం నిర్వహించారు. ముందుగా భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా జిల్లా అధ్యక్షులు పి మనోజ్ కుమార్ మాట్లాడారు. ఈ కార్యక్రమంలో గీతం డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ రామకృష్ణ, ఉపాధ్యాయులు మౌళి రత్నాకర్, ఎన్నారై కళాశాల డీన్ శివరామకృష్ణ, ప్రిన్సిపల్ కిషోర్ పాల్గొన్నారు.

చీరాల: ప్రజాస్వామ్య దేశంలో భావ ప్రకటన స్వేచ్ఛ ప్రతి ఒక్కరికీ ఉంటుందని, నేడు ప్రశ్నిస్తే రాజద్రోహం కేసు పెట్టి జైలు పాలు చేస్తారా అని ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య ప్రశ్నించారు. శనివారం రాజ్యాంగం ఆమోద దినోత్సవం సందర్భంగా ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో స్థానిక లూథరన్ కాలేజీలో రాజ్యాంగం – విద్యార్థులు, ప్రజాస్వామ్య హక్కులు అనే అంశంపై సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా పాల్గొన్న ఉపాధ్యాయులు హరిప్రసాద్ మాట్లాడుతూ ఆర్థిక సమానత్వాన్ని కల్పించిన అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా విద్యార్థులు చదువుకోవాలని ఆకాంక్షించారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఆర్య మాట్లాడుతూ నేడు అనేక రూపాల్లో రాజ్యాంగంపై దాడి చేస్తున్నారని, కేంద్రంలో ఏ ప్రభుత్వం అధికారంలో ఉంటే ఆ ప్రభుత్వం తమ సొంత ఎజెండాకు అనుకూలంగా మార్పులు చేసుకుంటున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు కుమార్, మాజీ ఎస్ఎఫ్ఐ నాయకులు బాబురావు పాల్గొన్నారు.

కేవిపిఎస్ ఆధ్వర్యంలో..

భారత రాజ్యాంగాన్ని పాలకులు దుర్వినియోగం చేస్తున్నారని కెవిపిఎస్ నాయకులు ఎల్ జయరాజు అన్నారు. శనివారం రాజ్యాంగం ఆమోదం దినోత్సవ సందర్భంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహనికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. రాజకీయ నాయకులు తమ పదవులను అంగట్లో సరుకులుగా అమ్మేస్తున్నారని అన్నారు. పాలకులు ఈ విషయాన్ని గమనించి చిత్తశుద్ధితో రాజ్యాంగ ప్రకారం నడుచుకోవాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా సిఐటియు చీరాల డివిజన్ నాయకులు ఎన్ బాబురావు, వసంతరావు, చీరాల నియోజకవర్గ నాయకులు శీలం రవికుమార్, పందిటి రామస్వామి, మణి బాబు, కాంగ్రెస్ నాయకులు హలీం, దేవరపల్లి బాబురావు, తన్నీరు విజయ్, బలహీన వర్గాల నాయకుడు ఆశీర్వాదం, సిపిఐ నాయకులు బాబురావు, ఎంఈఓ గాది హరిహరరావు రెడ్డి, ఎల్ఐసి నాయకులు రమేష్, గొట్టిపాటి కమలాకర్, ఏ రామారావు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే కరణం బలరాం ఆకస్మిక తనిఖీ

హుటాహుటిన చేరుకొన్న అధికారులు

ప్రజాశక్తి-వేటపాలెం

శనివారం సమయం సాయంత్రం మూడున్నర గంటలు.. వేటపాలెం మండల పరిషత్ ప్రాంగణం.. రివ్వున రెండు కార్లు దూసుకొచ్చాయి.. కారులో నుంచి స్థానిక ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి గన్‌మ్యాన్ కిందకు దిగి తహశీల్దార్ కార్యాలయంలోకి వెళ్లారు. అంతే వేగంగా సిబ్బందితో బయటకు వచ్చారు.. సార్ మేడమ్ లేరు.. ఒంగోలు మీటింగ్‌కు వెళ్లారు అని సమాధానం.. కారు కొద్దిగా ముందుకు కదిలే లోపున ఎంపిడిఓ కార్యాలయం సిబ్బంది బిలబిల మంటూ కారు వద్దకు చేరుకొన్నారు. ఈ హడావుడి ఏమి జరుగుతుందో తెలుసుకొని అధికారులు ఒక్కసారిగా ఖిన్నులయ్యారు. తేరుకొన్న ఉద్యోగులు ఒకరి వెంట ఒకరు వారి సీట్లను వదిలి ఎమ్మెల్యే కారు వద్దకు చేరుకొన్నారు. ఆ ప్రాంగణంలోనే ఉన్న ఇసుక డంపింగ్‌ను

రామన్నపేట పంచాయతీ కార్యాలయంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కరణం బలరామకృష్ణమూర్తి

చూసి ఇసుక మీద ఫిర్యాదులు వస్తున్నాయి. ఇసుకకు సంబంధించి ఎవరు ఇక్కడ అని ఆరా తీశారు. అక్కడ విధుల్లో ఉన్న ఉద్యోగిని ఇసుక ఎక్కడ నుంచి వస్తుంది.. ఎంతకు అమ్ముతున్నారు అడిగి వివరాలు తెలుసుకొన్నారు. ఆపాటికే రామన్నపేట పంచాయతీ కార్యాలయంలో జరుగుతున్న జనరల్ బాడీ సమావేశంలో ఉన్న వార్డు మెంబర్లు, సర్పంచ్ కె రమణ, కార్యదర్శి బాలిగ సురేంద్ర సమావేశం గురించి చెప్పి ఆహ్వానం పలికారు. సమావేశంలో పాల్గొన్న ఎమ్మెల్యే పంచాయతీ స్థితిగతుల గురించి, పెండింగ్ వర్క్‌ల గురించి అడిగి తెలుసుకొన్నారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్స్‌ను, ఆర్‌డబ్ల్యుఎస్ సిబ్బంది గురించి వివరాలు తెలుకొన్నారు. మరోపక్క ఉద్యోగులు ఎమ్మెల్యే వచ్చిన విషయం గురించి వారిపై అధికారులకు ఫోన్లలో సమాచారం చేరవేశారు. స్థానిక ఎంపిడిఓ ఎంవిఎస్ శర్మ, ఎమ్మెల్యే బలారం రామన్నపేట పంచాయతీ కార్యాలయం నుంచి బయటకు రావడంతోటే వేగంగా కారు దిగి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఇఓఆర్‌డి కె శ్రీనివాసరావు, ఉపసర్పంచ్ దంతం వెంకట సుబ్బారావు పాల్గొన్నారు.

'గడప గడపకూ'లో పాల్గొన్న రామనాథంబాబు

గ్రామాభివృద్ధే లక్ష్యంగా 'గడప గడపకూ'

రావి రామనాథం బాబు

ప్రజాశక్తి-చిన్నగంజాం

మండలంలోని రాజుబంగారుపాలెంలో 160వ రోజు గడప గడపకూ మనప్రభుత్వం కార్యక్రమంలో వైసిపి పర్చూరు నియోజకవర్గ ఇన్‌ఛార్జి రావి రామనాథం బాబు పాల్గొన్నారు. గ్రామాలలో ఉన్న చిన్నచిన్న సమస్యలకు గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ద్వారా పరిష్కారం దొరకటమే కాకుండా గతంలో ఎన్నడూ లేని విధంగా పట్టణాలకు ధీటుగా గ్రామాలను అభివృద్ధి చేయటం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి మాత్రమే సాధ్యమని అన్నారు. "గడప గడపకూ మన ప్రభుత్వం" కార్యక్రమం 160వ రోజులో భాగంగా శనివారం చినగంజాం మండలం, రాజు బంగారుపాలెం గ్రామంలో రావి రామనాథం బాబు పర్యటించారు. ఎలాంటి పక్షపాతం లేకుండా పార్టీలకతీతంగా సంక్షేమ ఫలాలు అందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి అని కొనియాడారు. ఈ కార్యక్రమంలో వైసిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారకు చర్యలు: ఎస్పీ

ప్రజాశక్తి-బాపట్ల జిల్లా

ప్రజలు రోడ్డు భద్రతా నియమాలు సరిగా పాటించకపోవడం వలన రోడ్డు ప్రమాదాలు జరిగి అనేక మంది వారి విలువైన ప్రాణాలు పోగొట్టుకుంటున్నారని, దీని నివారణకు రోడ్డు భద్రత నియమాలపై వాహనదారులతో పాటు పట్టణ, గ్రామ ప్రజలకు విస్తృత అవగాహన కల్పిస్తున్నట్లు జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ తెలిపారు. వాహనదారులు రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమాలు తప్పక పాటించాలని, అతి వేగం, మద్యం మత్తులో వాహనాలు నడపరాదని, వాహనాలు నడిపేటప్పుడు హెల్మెట్, సీట్ బెల్ట్ లను తప్పనిసరిగా ధరించి, రోడ్డు భద్రత నియమాలు పాటిస్తు సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని ఎస్పి సూచించారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-కర్లపాలెం

కర్లపాలెం మండలం పేరలి గ్రామంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని వైద్యులు గోరంట్ల కృష్ణ చైతన్య తెలిపారు. శనివారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కర్లపాలెం మండలం పేరలి గ్రామంలో డాక్టర్ కాంప్లెక్స్‌లో చీరాల వారి గోరంట్ల హాస్పిటల్ వారిచే ఉదయం 9గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ వైద్య శిబిరంలో ఉచిత ఓపి, ఎముకల సాంద్రత పరీక్షలు, షుగర్, బిపి పరీక్షలు చేస్తారని, ఉచితంగా మందులు ఇస్తారని తెలిపారు. ఈ అవకాశాన్ని పేరలి పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని అన్నారు.

జాతీయ బిసి సంఘం జిల్లా కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-కారంచేడు

నూతనంగా ఎన్నికైన కమిటీ బీసీల అభ్యున్నతికి పాటుపడాలని జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు రాజ్యసభ సభ్యులు ఆర్ కృష్ణయ్య అన్నారు. శనివారం నాడు రాజ్యసభ సభ్యులు, జాతీయ బీసీ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య చేతుల మీదుగా బాపట్ల జిల్లా కమిటీని నియామకం చేయడం జరిగింది. ఈ కమిటీల ఉపాధ్యక్షులుగా తన్నీరు విష్ణు వాసు, పీత శ్రీకాంత్, కట్టబోయిన సుబ్బారావు, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా గుంజి పుల్లారావు, పులి హరికృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కటారి హరిబాబు, పర్చూరు నియోజకవర్గ అధ్యక్షుడుగా గుంజి అనిల్ కుమార్‌ను బాపట్ల జిల్లా నూతన కమిటీలోకి తీసుకున్నామని బాపట్ల జిల్లా అధ్యక్షుడు కుంచపు వీరాంజనేయులు పత్రిక విలేకరుల సమావేశంలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అందరం కలిసి కట్టుగా పనిచేసి, బిసిల అభ్యున్నతికి పాటుపడాలని అన్నారు.

జ్యోతిప్రజ్వలన చేస్తున్న డాక్టర్ అరుణారెడ్డి

మంచి ఆహారపు అలవాట్లతో

మెరుగైన ఆరోగ్యం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మంచి ఆహారపు అలవాట్లతో మెరుగైన ఆరోగ్యం పొందవచ్చని ఆంధ్రప్రదేశ్ డయాబెటిక్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ పివి రావు సూచించారు. ఆంధ్రప్రదేశ్ డయాబెటీస్ ఫెడరేషన్ (ఏపిడిఎఫ్) 31వ రాష్ట్ర స్థాయి సమావేశాలు ఒంగోలు ఏ1 ఫంక్షన్ హాలులో శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. సమావేశానికి ఎపిడిఎఫ్ కార్య నిర్వాహక కార్యదర్శి డాక్టర్ డాక్టర్ కె. సీతా రామయ్య అధ్యక్షత వహించారు. మొదటి రోజు సదస్సులో ముఖ్య అతిథులు గా సీనియర్, ప్రముఖ డయాబెటీస్ డాక్టర్లు పివి రావు, విజయకుమార్, రామ్మోహన్ పాల్గొన్నారు. ఈ సదస్సులో రెండు తెలుగు రాష్ట్రాలతో పాటు తమిళనాడు నుంచి డాక్టర్స్ పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ పివి రావు 'షుగర్‌తో ఇతర అవయవాలు దెబ్బతినకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై చర్చించారు. సదస్సులో డాక్టర్లు కె. శ్రీనివాసరావు, పి.అరుణారెడ్డి, ఎం.కష్ణారావు, బి. సురేష్ బాబు, ఎన్. సునీత, శ్రీనివాస్, సుమారు 400 మంది డాక్టర్లు పాల్గొన్నారు.

నష్టపరిహారం అందజేయండి

కలెక్టర్ దినేష్‌కుమార్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భూసేకరణ ప్రక్రియకు సంబంధించిన నష్టపరిహారాన్ని లబ్ధిదారులకు త్వరితగతిన అందజేయాలని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ అధికారులను ఆదేశించారు. ఈ ప్రక్రియలో ఎదురవుతున్న సమస్యలను పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టాలన్నారు స్థానిక ప్రకాశం భవనంలోని స్పందన హాలులో శనివారం సంబంధిత అధికారులతో ప్రత్యేక సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జాతీయ రహదారులు 216, 565, 544(డి), 167(డి), 765, 16, 340(5), బెంగళూరు-కడప- విజయవాడ ఎక్స్‌ప్రెస్ హైవే, గుంటూరు-గుంతకల్లు, గూడూరు-విజయవాడ, నడికుడి- శ్రీకాళహస్తి రైల్వేలైన్ల విస్తరణ కోసం భూసేకరణ పనులకు సంబంధించి నష్టపరిహారం త్వరితగతిన అందజేయాలన్నారు. సమావేశంలో సంయుక్త కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిషోర్, డిఆర్ఒ బి.చిన ఓబులేసు, సబ్ కలెక్టర్ సేతు మాధవన్, స్పెషల్ కలెక్టర్ సరళా వందనం, ఆర్డీవో సందీప్‌కుమార్ పాల్గొన్నారు.

వైద్యపరీక్షలు చేస్తున్న దృశ్యం

మహిళలకు కేన్సర్‌పై అవగాహన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఎంఎన్‌ఆర్ హెచ్‌సిజి కేన్సర్‌సెంటర్ ఆధ్వర్యంలో స్థానిక సమైక్యతా నగర్ డ్వాక్రా మహిళలకు కేన్సర్ అవగాహన, ఉచిత స్క్రీన్ క్యాంపు శనివారం జరిగింది. ప్రముఖ కేన్సర్ నిపుణులు కె.సాయికృష్ణ మాట్లాడారు. 120 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు.

ప్రజానాట్యమండలి జిల్లా మహాసభలు ప్రారంభం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాట్లాడుతున్న రాష్ట్ర కార్యదర్శి అనిల్‌కుమార్

ప్రజానాట్యమండలి ప్రకాశం జిల్లా పదవ మహాసభలు శనివారం స్థానిక ఎల్బీజీ భవన్‌లో కామ్రేడ్ రామనాథం సుదర్శన్ నగర్‌లో ఉత్సాహవంతంగా ప్రారంభమయ్యాయి. ముందుగా ప్రారంభ సూచికంగా సంఘ జెండాను జిల్లా గౌరవ అధ్యక్షులు, రచయిత, దర్శకుడు బి దశరథ ఆవిష్కరించారు. అనంతరం జరిగిన ప్రారంభ సభకు జిల్లా అధ్య క్షుడు పి సురేష్ అధ్యక్షత వహించగా, ముఖ్య అతిథిగా రాష్ట్ర కార్యదర్శి ఎస్.అనిల్ కుమార్ మాట్లాడారు. ప్రత్యామ్నాయ సాంస్కృతిక ఉద్యమం నిర్మించాలని, ప్రజా సమస్యలపై నిరంతరం కళా రూపాలు తయారు చేస్తూ, మతోన్మాదాన్ని వ్యతిరేకించేలా ప్రజల్ని చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. రోజు రోజుకీ కవులు, కళాకారులు, రచయితల మీద దాడులు పెరిగిపోతున్నాయన్నారు. ప్రజావ్యతిరేక విధానాల్ని తిప్పికొట్టే విధంగా ప్రజల్ని చైతన్యపరిచాలని పిలుపునిచ్చారు. అనంతరం ఆలపించిన ప్రజా గీతాలు, అభ్యుదయ గీతాలు ఆకట్టుకున్నాయి. కార్యక్రమం లో తూర్పు ప్రకాశం కార్యదర్శి గంధవళ్ల బాల కృష్ణ, పశ్చిమ ప్రకాశం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రూబెన్, మహేష్, జానపద కళాకారుల సంఘం నాయకులు ఉబ్బా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

ప్రతి దరఖాస్తునూ క్షుణ్ణంగా పరిశీలించాలి

జిల్లా ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు ఎస్.సత్యనారాయణ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

మాట్లాడుతున్న సత్యనారాయణ

అర్హులైన అందరూ ఓటర్లుగా నమోదు చేసుకునేలా చూడాలని ప్రకాశం జిల్లా ఎలక్టోరల్ రోల్ పరిశీలకులు ఎస్. సత్యనారాయణ పేర్కొన్నారు. ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలించాలని, తిరస్కరణకు గురైతే అందుకు కారణాలను దరఖాస్తుదారులకు తెలియజేయాలని అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం జిల్లాకు వచ్చిన ఆయన గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎనిమిది నియోజకవర్గాలలో ఉన్న ఈఆర్ఒలు, ఏఈఆర్ఒలతో కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ తో కలిసి జిల్లాలోని పరిస్థితిపై సమీక్షించారు. 2023వ సంవత్సరానికి ఓటర్ల జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు విధానం, ఎమ్మెల్సీ ఎన్నికలకు ఓటర్ల నమోదు తీరుపై ఆయన తీశారు. సమావేశ వివరాలను కలెక్టర్ దినేష్ కుమార్ మీడియాకు వివరించారు. ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి ఆన్‌లైన్‌లో వచ్చిన దరఖాస్తులలో 27 శాతం తిరస్కరణకు గురయ్యాయని కలెక్టర్ వివరించారు. డిఆర్ఒ కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక బందం ఇందుకు కారణాలను పరిశీలించగా ఆన్‌లైన్‌లో కేవలం పేరు, ఫొటో, ఊరు మాత్రమే ప్రస్తావిస్తున్నారని, పూర్తి స్థాయి చిరునామాను దరఖాస్తుదారులు తెలియజేయడం లేదని గుర్తించినట్లు తెలిపారు. ప్రస్తుతం వీటిని సరిచేసుకునేందుకు ప్రభుత్వం అవకాశం ఇవ్వటంతో దరఖాస్తుదారులు ఈ వివరాలను పూర్తి స్థాయిలో సమర్పించాలని కలెక్టర్ సూచించారు. ఓపెన్ విధానంలో డిగ్రీ పూర్తి చేసిన వారికి కూడా రెగ్యులర్ గా డిగ్రీ చదివిన వారితో సమానంగా అర్హత ఉంటుందని ఆయన స్పష్టం చేశారు. జిల్లాలో ఆధార్ ఓటరు గుర్తింపు కార్డు అనుసంధానం ఇప్పటి వరకు 71 శాతం పూర్తయిందన్నారు. ఈ ప్రక్రియ స్వచ్ఛందమేనని, ఎలాంటి నిర్బంధం లేదని కలెక్టర్ స్పష్టం చేశారు. సమావేశంలో జెసి ఎం. అభిషిక్త్ కిషోర్, డిఆర్ఒ బి.చిన ఓబులేసు, మార్కాపురం సబ్ కలెక్టర్ సేతు మాధవన్, కనిగిరి ఆర్డీవో సందీప్ కుమార్, స్పెషల్ డిప్యూటి కలెక్టర్ హెలా షారోన్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

గృహాలు నిర్మించి ఇచ్చేందుకు సిద్ధం: కలెక్టర్

ప్రజాశక్తి-భట్టిప్రోలు

ప్రభుత్వం నిరుపేదలకు స్థలాలు కేటాయించి పట్టాలు పంపిణీ చేసిందని, దాంతో పాటు గృహాలు నిర్మించి అందించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని బాపట్ల కలెక్టర్ విజయకృష్ణన్ తెలిపారు. మండలంలోని సురేపల్లి గ్రామంలో శనివారం కలెక్టర్ విజయకష్ణన్ సిసి రహదారుల నిర్మాణానికి భూమిపూజ చేశారు. గ్రామానికి దూరంగా ఉన్న జగనన్న కాలనీకి వెళ్ళటానికి రహదారి మార్గం సరిగా లేనప్పటికీ బురదలోనే కాలినడకన వెళ్లి.. కాలనీని సందర్శించి.. మాట్లాడారు. ప్రతి ఒక్కరూ జగనన్న లే ఔట్‌లో గృహాలు నిర్మించుకునే విధంగా అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చెయ్యాలని సూచించారు. ముందుగా స్థలం మంజూరు కాబడిన లబ్ధిదారుని గహంలో కలెక్టర్ సహపంక్తి భోజనం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ మోర్ల విజయలక్ష్మి ఎంపిటిసి రావు రాజేశ్వరి, పిఏసిఎస్ ఛైర్మన్ గోవర్ధనగిరి శేషాచల శ్రీనివాసరావు, రేపల్లె ఆర్‌డిఒ పార్థసారథి, తహశీల్దార్ శ్రావణ్‌కుమార్ పాల్గొన్నారు.

'గడపగడపకూ..' ద్వారా సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి-శింగరాయకొండ

కేక్ కట్ చేస్తున్న వరికూట్ అశోక్‌బాబు

'గడపగడపకూ మన ప్రభుత్వం' ద్వారా అన్ని సమస్యలూ పరిష్కారం అవుతున్నాయని వైసిపి కొండపి ఇన్‌ఛార్జి వరికూటి అశోక్‌బాబు అన్నారు. శింగరాయకొండ గ్రామ పంచాయతీలోని సచివాలయం-1, సచివాలయం-2లో గడపగడపకూ మన ప్రభుత్వ కార్యక్రమం శనివారం నిర్వహించారు. నియోజకవర్గంలో అశోక్‌బాబు శనివారం నాటికి ఈ కార్యక్రమంలో 50 వేల గడపలు పూర్తి కావడంతో కూరగాయల మార్కెట్ వద్ద భారీ సభ నిర్వహించారు. సభ అనంతరం భారీ కేకును కట్ చేశారు. అశోక్‌బాబు మాట్లాడుతూ ఎమ్మెల్యే స్వామి మరుగుదొడ్ల కుంభకోణంపై చర్చకి రావాలని సవాలు విసిరారు. నియోజకవర్గంలో వైసీపీలో నలుగురు టిక్కెట్ కోసం పోటీ పడుతున్నారని చెబుతున్నారని, తెలుగుదేశంలో టిక్కెట్ అడిగే దిక్కేలేరని పేర్కొన్నారు. అశోక్‌బాబు, ఆయన సతీమణి లక్ష్మి కేక్‌ను కట్ చేశారు. కార్యక్రమంలో వైసీపీ ఒంగోలు పార్లమెంటు వైద్యవిభాగం అధ్యక్షులు డాక్టర్ బత్తుల అశోక్ కుమార్ రెడ్డి, ఎంపీపీ కట్ట శోభారాణి, శింగరాయకొండ సర్పంచ్ తాడిపర్తి వనజ పాల్గొన్నారు.

తథ్యమైన మార్పు

మార్పు అనివార్యం. ఆపినా ఆగదు. దాచినా దాగదు. ఇందులో సందేహం ఏమాత్రం లేదనే చెప్పాలి. పాలకవర్గాలూ తమ వ్యూహాలకు పదునుపెట్టేందుకూ మార్పుల దిశగా అడుగులు వేస్తుంటారు. అలాంటి అడుగులే ఇపుడు తథ్యమయ్యాయి. నాయకత్వ మార్పుల్లో వైసిపి పాచిక ఏమిటి? ఎలాంటి స్వలాభాలు యోచించి నిర్ణయాలు తీసుకున్నారు? వీటి వల్ల ప్రస్తుతం చోటుచేసుకుంటున్న పరిణామాలు ఏమిటి? గతంలో ఉన్న వివాదాలకు ఏ మేరకు పరిష్కారం చూపాయన్నదే ఇపుడు చర్చగా మారింది. జిల్లా కోఆర్డినేటర్ బాధ్యతల నుంచి బాలినేనిని తప్పించి మరో మూడు కీలక జిల్లాలు అప్పగించారు. దీనిపై మిశ్రమ స్పందన వ్యక్తమవడం సహజం. అయితే ఆయనకు అప్పగించిన జిల్లాలు అత్యంత కీలకంగా మారాయి. పార్టీకి వచ్చే ఎన్నికల్లో వెన్నుదన్నుగా నిలుస్తాయనే అంచనాల్లోనూ ఉన్నారు. వీటిని అప్పగించడం బాలినేని నాయకత్వ బాధ్యతలకు సవాలుగానే ఉంటాయనే విశ్లేషణలూ వినిపిస్తున్నాయి. జిల్లాలో మరికొన్ని మార్పులను చూస్తే జంకే వెంకటరెడ్డికి అధ్యక్ష పదవి అప్పగించారు. ఏడాది తిరక్కుండానే కనిగిరి ఎమ్మెల్యే బుర్రాను తప్పించడం వ్యూహాత్మకమేనంటున్నారు. ఇక బాపట్ల జిల్లాలో పాలకపక్షంలో టిక్కెట్ల వ్యవహారం వాడివేడిగా మారింది. పర్చూరు వ్యవహారంపై ప్రతిసారీ చర్చ ఎంతమేరకు సబబు అనేదీ పార్టీ వర్గాల్లో ఉంది. అక్కడ ఇన్‌ఛార్జి మార్పుపై తర్జనభర్జనలు పడుతున్నారు. అద్దంకి, పర్చూరు, చీరాల నియోజకవర్గాల్లో సామాజిక రాజకీయ సమతుల్యతలపై పాలకపక్షంలో సందిగ్ధం కొనసాగుతోంది. మూడు నియోజకవర్గాల్లో ఒకే సామాజిక వర్గం నుంచి అభ్యర్థులను బరిలో దించే విషయంలోనే ఇంకా ఓ స్పష్టతకు రాలేకపోతున్నారు. అందుకే మార్పులపై ఇంకా దృష్టి సారించే ఉన్నట్లు విదితమవుతోంది.

మళ్లీ భూసేకరణలు మొదలయ్యాయి. ఒక వైపు ఎక్స్‌ప్రెస్‌వేకు.. మరో వైపు పామూరు మండలం, మాలకొండాపురం ప్రాంతంలో నిమ్స్ కోసం భూములను సేకరించేందుకు అధికారులు రంగంలోకి దిగారు. ఏపిఐఐసీ నేతృత్వంలో చేపట్టబోయే నిమ్జ్‌పై అభ్యంతరాలు తెలుసుకునేందుకు కాలుష్యమండలి అభిప్రాయసేకరణ కూడా చేపట్టింది. పామూరు, పీసీపల్లి మండలాల్లోని పలు గ్రామాలకు చెందిన రైతులు వచ్చి తమ అనుమానాలను అధికారుల దృష్టికి తీసుకుపోయారు. భూములను తీసుకుంటే తాము నష్టపోతామని, సాగు చేసుకుంటున్న భూములు పోతే ఎలాగని మొరపెట్టుకున్నారు. అధికారులు నిమ్జ్ వల్ల జరిగే ప్రయోజనాలు, ఉపాధి వంటివి వివరించి వచ్చారు. భూసేకరణ వల్ల రైతులకు సాగుభూమి చేజారుతుందన్నది వాస్తవం. అయితే ప్రత్యామ్నాయాలు చూడకుండా భూములను లాగేసుకుంటే రైతులు నష్టపోతారు. పరిహారాలు, ఉపాధి, భవిష్యత్ జీవనోపాధి వంటి వాటిపై స్పష్టమైన ప్రణాళికతో ముందుకుపోతే రైతుల్లోనూ అవగాహన పెరుగుతుంది. అలాంటి సమగ్రమైన ప్రణాళికలు మాత్రం కనిపించడం లేదు. ఎప్పుడో పదేళ్ల క్రితం ప్రకటించిన ప్రాజెక్టు ఇది. దీన్ని ఇప్పుడు మళ్లీ తెరపైకి తెచ్చారు. భూములు సేకరించాక పరిశ్రమలు ఎప్పుడు పెడతారన్నదీ చూడాలి. మరో వైపు రహదారి కోసం భూసేకరణ ప్రక్రియ మొదలైంది. పరిహారం ఎంతనేదీ తేల్చలేదని రైతులు కలవరపడుతున్నారు.

రబీ సాగు ఊపందుకుంది. ప్రస్తుతం పొగాకు, మిర్చి నాట్లు ముమ్మరంగా సాగుతున్నాయి. ప్రస్తుతం ధరలు ఆశాజనకంగా ఉన్నాయి. కొన్ని పంటలకు వ్యాపారులే వ్యూహాత్మకంగా ధరలు పెంచారు. దీంతో ఆయా పంటల సాగు పెరిగే అవకాశాలున్నాయి. వేలం ఆఖరులో పొగాకు గరిష్ట ధర బాగా పెరిగింది. దీంతో పొగాకుపై రైతులు మొగ్గు చూపుతున్నారు. మిర్చి ధర క్వింటా రూ.22 వేల వరకూ ఉంది. తెలంగాణాలో పాతిక వేలకు పైగా ధర ఉంది. దీంతో మిర్చి సాగు పెరిగే అవకాశాలున్నాయి. పత్తి క్వింటా రూ.9 వేలు ఉంది. పత్తి సాగు పెరిగినా వర్షాలకు దెబ్బతింది. దీంతో పత్తికి గిరాకీ మరింత పెరిగింది. ఈ ధరలను చూసి ఇప్పుడు రైతులు ఆయా పంటల సాగును పెంచేందుకు ఆలోచన చేస్తున్నారు. అయితే పంట చేతికి వచ్చాక ఈ ధరలు సగానికి సగం పడిపోవడం ఖాయమంటున్నారు.ఇదే వ్యాపారుల వ్యూహం.

ఎమ్మెల్సీ ఓటర్ల ముసాయిదా జాబితా సిద్ధమైంది. ఎంత మంది పేర్లున్నాయనేదీ తేలింది. పోయిన వారు తిరిగి దరఖాస్తు చేసుకునే వీలుంటుంది. అయితే ఎంతమేరకు పరిగణలోకి తీసుకుంటారనేదీ చూడాలి. ప్రస్తుతం గ్రాడ్యుయేట్ జాబితా లక్షకు పైనే ఉంది. ఉపాధ్యాయుల సంఖ్య తక్కువగా ఉంది. నమోదు ప్రక్రియలో రాజకీయాలు పెరిగాయి. పాలకపక్షం నుంచి సచివాలయ సిబ్బందిని నియంత్రణ చేశారు. వారికి అనుకూలంగా చేర్పుల పర్వం నడిచిందనే విమర్శలున్నాయి.

మంత్రి ఆదిమూలపు సురేష్ తన నియోజకవర్గంలో వీల్‌ఛైర్ నుంచే గడపగడపకూ.. కార్యక్రమాన్ని నిర్వహించడం చర్చగా మారింది. ప్రస్తుతం ఆయన మోకాలుకు ఆపరేషన్ చేయించుకున్నందున నడవలేని పరిస్థితి. అయినా నియోజకవర్గంలో వీల్‌ఛైర్ నుంచే పర్యటనలు కొనసాగిస్తున్నారు. ప్రకాశం కలెక్టర్ దినేష్‌కుమార్ జగనన్న ఇళ్లపై దృష్టి సారించారు. గ్రామాల్లోకి వెళ్లినప్పుడు ఇళ్లను పరిశీలిస్తున్నారు. జేసీ అభిషిక్త్ కిషోర్ పశ్చిమప్రాంతంలో పర్యటించారు. వెలుగొండ ప్రాజెక్టు నిర్వాసిత కాలనీలను సందర్శించారు. క్షేత్రస్థాయిలో సమస్యలపై దృష్టి సారించారు.